ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 287 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 13 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

## భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**ఢిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు



# సంక్రాంతి కానుకగా..

## ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

## ప్రభుత్వ ఉద్యోగుల డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు

- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్
- పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తింపు
- జనవరి నెల వేతనంతో పాటు పెరిగిన డీఏ చెల్లించనున్న ప్రభుత్వం
- 'జిల్లాల సరిహద్దులు మార్చాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి
- అందుకే జిల్లాల పునర్విభజన కోసం ఒక రిటైర్డ్ జడ్జీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయనున్నాం
- సన్న వరిధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ నిధులను పౌరసరఫరాల శాఖ విడుదల
- వానాకాలం సీజన్‌లో సన్నరకం వడ్లు పండించిన రైతులకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్

## ఉద్యోగులే ప్రభుత్వ సారథులు.. వారధులు

ఒక్కరోజు సెలవు తీసుకుందామనుకున్నా ఏదో ఒక పని వచ్చిపడుతోంది

ఇప్పటి వరకు తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు


ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరు

**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్. ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం రేవంత్ సంక్రాంతి కానుక ప్రకటించారు. ఉద్యోగులకు మరో డీఏ ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ ప్రకటన చేశారు. డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చా. రేపో మాపో డీఏ జీవో వస్తుంది'అని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెన్షనర్లకు డీఏ,డీఆర్ పెంపు ప్రకటించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది పెన్షనర్లకు ఉపశమనం కలగనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 30.03శాతం డీఆర్‌ను 33.67శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంపు 2018 జూలై 1 తర్వాత రిటైర్డ్ అయిన పెన్షనర్లకు వర్తించనుంది. 2020 రివైజ్డ్ పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి ఇది ప్రత్యక్ష లాభం కలిగిస్తుంది. 2018కి ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్లకు కూడా డీఆర్ పెంపు వర్తించనుంది. 2015 పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి డీఆర్ 68.628శాతం నుంచి 73.344శాతానికి పెరిగింది. 2016 పే స్కేల్స్ పెన్షనర్లకు డీఆర్ 42శాతం నుంచి 46శాతానికి పెంపు జరిగింది. UGC/AICTE 2006 పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి డీఆర్ 221శాతం నుంచి 230శాతానికి పెరిగింది. ఈ పెంపు విద్యా రంగానికి చెందిన పెన్షనర్లకు గణనీయమైన లాభం కలిగించనుంది. పెరిగిన డీఆర్ 2023 జూలై 1 నుంచి అమలులోకి వస్తుంది. 2023 జూలై నుంచి 2025 డిసెంబర్ వరకు పెరిగిన డీఆర్ బకాయిలు చెల్లించనున్నారు. ఈ బకాయిలు మొత్తం 30 నెలవారీ వాయిదాల్లో చెల్లించబడతాయి. 2026 జనవరి నెల పెన్షన్‌తో పెరిగిన డీఆర్ - మిగతా3లో

## దేశీ బుల్లెట్‌లో రాకెట్!





## రిస్క్ తీసుకుంటేనే ఉన్నత స్థానం

- యువత రిస్క్ తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడకూడదు
- మీ విజయం దేశాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుంది
- 2047 వికసిత్ భారత్ ప్రయాణం దేశ అభివృద్ధికి ఎంతో కీలకం
- ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో అనేక మార్పులు తెచ్చామని ఐఐటీలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నాం

# వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే



- యూరియా ఇవ్వని వ్యక్తి.. పాలమూరును సస్యశ్యామలం చేస్తారా?
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 14 పరిశ్రమలు ఎందుకు పారిపోయాయి
- మూటలు కట్టి డబ్బులను ఢిల్లీకి తరలిస్తున్నారు
- పాలమూరు రైతన్నలను రేవంత్‌రెడ్డి ఎండపెడుతున్నారని
- యూరియా ఇవ్వని వ్యక్తి పాలమూరును సస్యశ్యామలం చేస్తామంటున్నారంటూ ఎద్దేవా
- "కృష్ణా జలాలు మన వద్ద ఉన్నప్పుడే తీసుకుంటే కిందకు వెళ్లవు

**మహబూబ్‌నగర్**

బీఆర్ఎస్ హయాంలో పెట్టిన పరిశ్రమలకు ఇప్పుడు రిబ్బన్లు కట్ చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం జరిగింది. మహబూబ్‌నగర్‌లో ఐటీ హబ్ పెట్టి 14 పరిశ్రమలు తెస్తే ఇప్పుడు పారిపోయేలా చేశారని కేటీఆర్ ఆరోపించారు. పాలమూరు రైతన్నలను రేవంత్‌రెడ్డి ఎండపెడుతున్నారని విమర్శించారు. యూరియా ఇవ్వని వ్యక్తి పాలమూరును సస్యశ్యామలం చేస్తామంటున్నారంటూ ఎద్దేవా చేశారు. "కృష్ణా జలాలు మన వద్ద - మిగతా3లో



## నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ

- బీఆర్ఎస్, ఎంఐఎంపై కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- 'ఉపాధి హామీ కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించాం
- పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చాం
- వంద రోజుల పని దినాలను 125కి పెంచాం
- వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నాం.
- నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాం




## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

- ఈసీకి మరోసారి మమతా బెనర్జీ లేఖ
- 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆరోపణ
- నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న మమతా బెనర్జీ
- ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఈసీకి ఇది ఐదో లేఖ



## మిత్రుల మధ్య విభేదాలు సహజమే..

- అందుకే ట్రంప్-మోదీ మధ్య దూరం!: అమెరికా రాయబారి
- ట్రంప్, మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనన్న అమెరికా రాయబారి
- ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద దేశమన్న సెర్గియో గోర్
- రెండు దేశాల సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని వ్యాఖ్య



## అత్యాధునిక టెక్నాలజీతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు

- ఎన్‌హెచ్‌ఏఐపై నితిన్ గడ్కరీ ప్రశంసలు
- బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో 4 గిన్నిస్ రికార్డులు
- నూతన సాంకేతికతతో అద్భుతంగా నిర్మించారన్న గడ్కరీ
- ఈ రికార్డులు దేశానికి, ఏపీకి గర్వకారణమన్న చంద్రబాబు

## సంపాదకీయం

# మహాత్ముని చివరి నిరాహార దీక్ష

భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ- ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితే నే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే..గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజన వాడన శుభ్రం చేస్తు గడపడం విశేషం.దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసలవల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాలమధ్య విరోధాలు ప్రబలి మతవిద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం.జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు.1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది దిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. 'వైష్ణవ జ న్ తో తేనె కహియే తో పాటు, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. ఇలా ఆయన ఢిల్లీలో తన చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు దిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు.కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందు తీవ్రవాదులు భావించారు.గాంధీ హత్యకు దారితీసింది హిందు- ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ నేపథ్యంలో నే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగింది. గాంధీ సమ్మతితో కాంగ్రెస్ లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు - పేలికలు గా మార్చారని, దేశ విభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన

# అంగ రంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు



ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మల్లికార్జున స్వామి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం అయినాయి. దట్టమైన నల్లమల అడవుల్లో, కృష్ణానది ఒడ్డున.. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకేచోట వెలసిన భూలోకకైలాసమే శ్రీశైలం. ఇక్కడ పరమేశ్వరుడు ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున లింగం రూపంలో కొలువైతే, పార్వతీదేవి అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన భ్రమరాంబికా దేవిగా దర్శనమిస్తోంది. భూలోక కైలాసంగా గుర్తింపు పొందిన శ్రీక్షేత్రంలో ఏడాదికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలను... మొదటి ఉత్సవాలను సంక్రాంతి సమయంలో... రెండోసారి మాఘమాసంలో వచ్చే మహాశివ రాత్రి సమయంలో నిర్వహిస్తారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పంచాహ్నిక దీక్షలతో 7 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 12న ప్రాంభమై, 18 తో ముగుస్తాయి. తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవ హిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరిస్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదలీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు.శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు.శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం - శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోంది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుం టారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళు డు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్నశ్రీశైల క్షేత్రంలో శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించు కొని శనివారం ఉదయం యాగశాల ప్రవేశంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయినాయి. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 18న ముగియనున్నా యి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు స్వాగతం పలుకుతూ శ్రీశైలం ముఖద్వారం నుంచి శ్రీశైలం వరకు రహదారి మార్గంలో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. భృంగివాహనసేవ, రావణ వాహనసేవ, నంది వాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, కైలాస వాహనసేవ, యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోణ కార్యక్రమా లు, 18వ తేదీన జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12నుంచి 18వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజ యహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలిపి వేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.సంక్రాంతి ఉత్సవాలు జనవరి 12న ఉదయం స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ నుంచి మల్లన్న స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు వివిధ వాహన సేవలు నిర్వహిస్తారు. భక్తులకు కనువిందు చేసేలా ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. మకర సంక్రాంతి పర్వదినమైన 15వ తేదీన స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కళ్యాణం నిర్వహిస్తారు. ఈ కళ్యాణ మహోత్సవానికి చెంచు గిరిజన భక్తులకు దేవస్థానం ప్రత్యేక ఆహ్వానం అందించింది. చెంచు సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి సమక్షంలో కళ్యాణం జరగడం శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించే రుద్ర హోమం, చండీ హోమం, మృత్యుంజయ హోమం, గణపతి హోమం, చండీ?రుద్ర పారాయణం వంటి యాగాలు జనవరి 12 నుంచి 18 వరకు నిరంతరంగా జరుగుతాయి. అయితే, ఉత్సవాల కారణంగా ఈ కాలంలో ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదో షకాల సేవ, ఏకాంత సేవలు, స్వామి?అమ్మవారి కళ్యాణం, ఇతర ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, 12 నుంచి 18 వరకు రుద్ర, చండి, మృత్యుంజయ, గణపతి హోమాల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం అద్దేపల్లి



అద్దేపల్లి రామమోహనరావు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందిన కవి, విమర్శకుడు, ప్రజాస్వామ్య భావజాలాల కోసం పోరాడిన వ్యక్తి. విప్లవ సాహిత్య క్షేత్రంలో ఆయన చూపిన దారిలో నేటికీ అనేక రచయితలు తమ కవిత్వం, రచనల ద్వారా ముందుకు సాగుతున్నారు.జీవిత విశేషాలుఅద్దేపల్లి రామమోహనరావు1936 సెప్టెంబర్ 6న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా, చింతగుంటపాలెం గ్రామంలో జన్మించారు. పేదరికంలో పెరిగినా, విద్యా అభ్యాసం ద్వారా తన జీవితాన్ని మార్చుకున్నారు.తన మాతృభాష తెలుగు పట్ల గల ప్రేమను చిన్ననాటి నుంచే ప్రదర్శించారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో ఎం.ఏ. (తెలుగు) పూర్తి చేశారు.విద్యా రంగంలో కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుడిగా, తర్వాత ప్రొఫెసర్‌గా సేవలందించారు.సాహిత్య జీవితం అద్దేపల్లి రామమోహనరావు విప్లవ సాహిత్య క్షేత్రంలో ఒక మార్గదర్శకుడిగా నిలిచారు. తెలుగు సాహిత్య రంగంలో విప్లవ కవిత్వాన్ని ప్రోత్సహించి, ప్రజల కష్టాలు, అణచివేత, అసమానతలను అక్షర రూపంలో ప్రతిబింబించారు. విప్లవ కవిత్వంలో ప్రముఖులు అయిన ఆవంత్స సోమసుందర్, చెరబండ రాజు, నగ్నముని, కె. శివారెడ్డి వంటి వారి రచనల ప్రభావంతో, ఆయన సాహిత్య రంగానికి ప్రేరణ పొందారు.తెలుగులో మినీ కవితా ప్రక్రియ (హైకూ) ను ప్రవేశపెట్టిన ప్రముఖ కవుల్లో ఆయన ఒకరు.విప్లవ కవిత్వంవిప్లవ కవిత్వంలో అద్దేపల్లి రామమోహనరావు రచనలు సామాజిక సమస్యలపై అవగాహన కలిగించడమే కాకుండా, మార్పు కోసం ప్రజలను ప్రేరేపించాయి. సమాజంలోని అసమానతలు: పేదరికం, అణచివేత, మరియు వివక్షత వంటి సమస్యలను తన కవిత్వంలో ఎండగొట్టారు. మార్క్సిస్ట్ ఆలోచనలు: ఆయన కవిత్వం మార్క్సిస్ట్ భావజాలంతో నిండి ఉండేది. సమానత్వం, శ్రామిక వర్గ విముక్తి కోసం ఆయన పాడిన పాటలు ప్రజలను చైతన్యవంతులను చేశాయి.ప్రజా భావన: ఆయన రచనలు ప్రజల గళాన్ని ప్రతిఫలింపజేశాయి.అద్దేపల్లి రామమోహన రావు కేవలం కవి మాత్రమే కాదు, తెలుగు సాహిత్యంలో ఒక ప్రముఖ విమర్శకుడిగా కూడా ప్రసిద్ధి చెందారు.ఆయన విమర్శలు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపించాయి. తెలుగులో హైకూ కవిత్వం, అనుశీలన - ఒక పరామర్శ పేరుతో తెలుగు హైకూ కవిత్వంపై మొట్టమొదటి విమర్శాత్మక గ్రంథాన్ని రాశారు.సాహిత్య విమర్శ విషయంలో ఆయన పరిశీలనా శైలి లోతైనది, సాధికారికమైనది. ప్రచురణలు, రచనలుఅద్దేపల్లి రామమోహన రావు గారు అనేక కవితా సంపుటాలు, విమర్శ గ్రంథాలు, మరియు వ్యాసాలు రచిం చారు. ముఖ్య రచనలు:తెలుగులో హైకూ కవిత్వం, సాహిత్య వివేకం, తెలుగు తేజం, అనేక ప్రజాకవిత్వ సంపుటాలు. అవార్డులుఆయన రచనలు తెలుగు సాహిత్యంపై ప్రత్యేక ముద్ర వేసినందుకు అనేక గుర్తింపులు పొందాయి. తెలుగు సాహిత్య రత్న బిరుదు.అనేక సాహిత్య సంస్థల నుండి ప్రశంసలు, పురస్కారాలు పొందారు.విప్లవ సాహిత్యంలో ఆయన చేసిన కృషి ఎందరికో ఆదర్శంగా నిలిచింది.అద్దేపల్లి రామమోహనరావు 2016 జనవరి 13న కన్నుమూశారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, విమర్శలు, కవిత్వం నేటికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.విప్లవ భావజాలాన్ని కొనసాగించే రచయితలలో ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది.ఆయన రచనల ద్వారా సాహిత్య ప్రేమికులు తెలుగు భాషా వైభవాన్ని స్మరించు కుంటున్నారు.అద్దేపల్లి రామమోహనరావు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక చిరస్థాయి అధ్యాయం.విప్లవ భావజాలానికి, ప్రజల కష్టాలకు అక్షరరూపం ఇచ్చిన ఆయన రచనలు తెలుగు భాషాభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయి.భవిష్యత్తు తరాలకు ఆయన రచనలు మార్గదర్శకంగా ఉంటాయి.తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను ఈ తరం, రాబోయే తరాలు చిరస్థాయిగా గుర్తుంచు కుంటాయి.

ధర్మఘంట

# దేశీ బుల్లెట్‌లో రాకెట్!

“ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా లేదా?” అంటాడో హీరో. ఇప్పుడీ డైలాగును ఐఐటీ మద్రాస్ కూడా గర్వంగా కొట్టేయవచ్చు. అవును మరి.. ప్రపంచంలోని ఏ దేశానికీ లేని సరికొత్త, వినూత్నమైన తుపాకీ గుండును ఈ సంస్థ విజయవంతంగా తయారు చేసి పరీక్షించింది కూడా. ఈ సరికొత్త తుపాకీ గుండును, ధనుష్ హోవిట్జర్, కే-9 వజ్ర-టీ, బోఫోర్స్ వంటి తుపాకుల్లో పెట్టి కాల్చామను కోండి... ఒకొక్కటీ మామూలు బుల్లెట్ల కంటే సగం దూరం ఎక్కువ ప్రయాణిస్తాయి. అదే సమయంలో వీటి విధ్వంసక శక్తి ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఈ అద్భుత ఆవిష్కరణ విశేషాలు...



దేశ సరిహద్దుల రక్షణలో శతఘ్ని వ్యవస్థల పాత్ర చాలా కీలకం. అయితే వీటితో ఒక చిక్కుంది. ధనుష్ హోవిట్జర్‌సహా 155 మిల్లీమీటర్ల గుండ్లు వాడే తుపాకులు ప్రయాణించగలిగే దూరం 40 కిలోమీటర్లకు మించదు. అందుకే మన భద్రత దళాలు వీటిని సరిహద్దుల్లో అతి దగ్గరి నుంచి జరిపే దాడులకు మాత్రమే ఉపయోగిస్తూంటారు. కొంచెం ఎక్కువ దూరంలోని లక్ష్యాలను తాకాలంటే ప్రళయ్ (150 - 500 కిలోమీటర్లు) లేదా పినాక (40 - 90 కి.మీ)లు వాడాల్సి ఉంటుంది. తుపాకులతో పోలిస్తే రాకెట్లతో పనిచేసే క్షిపణుల తయారీ, మోహరించడం రెండూ వ్యయ, ప్రయాసలతో కూడుకున్నవే. ఇలా కాకుండా.. తూపాకులతోనే వంద కిలోమీటర్ల దూరాన్ని కూడా తాకగలిగితే...? ఐఐటీ మద్రాస్ అభివృద్ధి చేసి, విజయవంతంగా పరీక్షించిన రామ్‌జెట్ ఇంజిన్లు సరిగ్గా ఇదే పని చేస్తాయి.

**ఏమిటీ రామ్‌జెట్?**

రాకెట్ ఇంజిన్ మాదిరిగానే ఇది కూడా ఓ ఇంజిన్. అంతే. కాకపోతే.. రాకెట్ ఇంజిన్ల మాదిరి వీటిల్లో బోలెడన్ని విడిభాగాలు ఉండవు. గాలిని పీల్చుకుని, తనలోని ఇంధనానికి కలిపి ముందుకు దూసుకెళుతూంటుంది. ధ్వని కంటే మూడు నుంచి ఆరు రెట్లు ఎక్కువ వేగంతో వెళ్లగలదు. ఇంజిన్లతో పనిచేసే క్షిపణులు రష్యాతోపాటు ఫ్రాన్స్, ఇండియా, ఫ్రాన్స్, చైనా, స్వీడన్, యూకేల వద్ద మాత్రమే ఉన్నాయి. అగ్రరాజ్యం అమెరికా వద్ద కూడా లేవు. ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని ఇప్పుడు ఈ టెక్నాలజీ క్షిపణుల కంటే చాలా తక్కువ సైజులో ఉండే తుపాకీ గుళ్లలోకి చేరిపోయింది. భారత ఆర్మీ బోర్డు, ఐఐటీ మద్రాస్‌లు సంయుక్తంగా తయారు చేసిన రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్లను ప్రోఖ్రాన్‌లో విజయవంతంగా పరీక్షించారు. ప్రొఫెసర్లు పి.ఎ.రామకృష్ణ, హెచ్ఎస్ఎన్ మూర్తి, జి.రాజేశ్, ఎం.రామకృష్ణ, మురుగయన్, లాజర్‌లతోపాటు విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ పి.ఆర్.శంకర్, లెఫ్టినెంట్ జనరల్ హరి మోహన్ అయ్యర్, డాక్టర్ యేగేశ్ కుమార్ వేలరిలతో కూడిన బృందం రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్ల తయారీలో కీలకపాత్ర పోషించారు.

**క్షిపణుల్లోనూ వాడవచ్చు: ప్రొఫెసర్ రామకృష్ణ**

రామ్‌జెట్ టెక్నాలజీని బోఫోర్స్ మినహా ఇతర క్షిపణుల్లో వాడేందుకు తాము అభివృద్ధి చేసిన టెక్నాలజీ ఉపయోగపడు తుందని ఐఐటీ మద్రాస్‌లోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగపు అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎ.రామకృష్ణ తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిపారు. తొలుత తాము 76 మిల్లీమీటర్ తుపాకులతో రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్లను పరీక్షించి చూశఋుమని, ఆ తరువాత దశలవారీగా 155 మిల్లీమీటర్ల శతఘ్ని వ్యవస్థకు విస్తరించామని వివరించారు. గత ఏడాది సెప్టెంబరులో దియోలాలీలోని స్కూల్ ఆఫ్ ఆర్టిలరీలో విజయవంతంగా పరీక్షలు నిర్వహించామని, తుపాకీ నుంచి గుండు చాలా స్పష్టంగా బయటపడటంతోపాటు స్థిరమైన వేగంతో ప్రయాణించిందని, రామ్‌జెట్ ఇంజిన్ కూడా సకాలంలో మండిందని ఆయన వివరించారు. డిసెంబరులో వీటిని పోఖ్రాన్‌లోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో పరీక్షించామని తెలిపారు. ప్రస్తుతం ఈ టెక్నాలజీకి తుదిమెరుగులు దిద్దుతున్నామని, అన్నీ సవ్యంగా సాగి భద్రత దళాలు వాడటం మొదలుపెడితే ఖర్చు కలిసిరావడమే కాకుండా.. వ్యూహాత్మకంగానూ ఎన్నో ప్రయోజనాలుంటాయని చెప్పారు.

# భూటాన్ కార్ల స్మగ్లింగ్ కలకలం..
# ఎంబసీ కారుగా నమ్మించి..

**కొచ్చి:** కేరళలోని కొచ్చిలో భూటాన్ కార్ల స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టయ్యింది. భూటాన్ నుండి అక్రమంగా భారత్‌కు తరలించిన టయోటా ల్యాండ్ క్రూయిజర్ కారును.. భారత రాయబార కార్యాలయం (×అఎఋఅ జుఎఝంంఎ) వాహనంగా నమ్మించి, విక్రయించిన ఘటనపై కొచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీకి చెందిన రోహిత్ బేడీ అనే వ్యక్తి ఎడపల్లి(కేరళ)కి చెందిన మహమ్మద్ యాహ్యాను నమ్మించి, కారు విక్రయానికి రూ. 14 లక్షలకు డీల్ కుదుర్చుకున్నాడు. విలాసవంతమైన కార్లను తక్కువ ధరకే విక్రయించడానికి మోసగాళ్లు వాటిని ‘ఎంబసీ వెహికల్’గా చెబుతుంటారు. దీనిని నమ్మిన బాధితుడు, దఫదఫాలుగా నగదు రూపంలోనూ, బ్యాంక్ బదిలీల ద్వారా కారు కొనుగోలుకు మొత్తం సొమ్మును చెల్లించాడు. గత ఏడాది అక్టోబర్‌లో కస్టమ్స్ విభాగం చేపట్టిన ‘ఆపరేషన్ నుంఖోర్’లో భాగంగా హిమాచల్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన ఈ ల్యాండ్ క్రూయిజర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూటాన్ నుండి అక్రమ మార్గాల్లో దిగుమతి చేసుకుని, నకిలీ పత్రాలతో భారత్‌లో రిజిస్ట్రేషన్ చేయించిన వాహనాలను అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. తాను కొనుగోలు చేసిన కారు ఎంబసీ వాహనం కాదని, అక్రమంగా స్మగ్లింగ్ చేసినదని గుర్తించిన బాధితుడు యాహ్యా, తనను మోసం చేసిన బ్రోకర్‌పై ఎర్నాకులం సెంట్రల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో దీని వెనుక భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. భూటాన్‌లో పన్నులు తక్కువగా ఉన్న కారణంగా, అక్కడి నుంచి కార్లను దిగుమతి చేయడం లేదా పాత కార్లను కొనుగోలు చేసి భారత్‌కు తరలించడం లాంటి పనులను ముఠా సభ్యులు చేస్తుంటారు. అలాగే భారీ దిగుమతి సుంకాలను తప్పించుకునేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లేదా భారత సైన్యానికి చెందిన నకిలీ ఎన్ఓసీలను సృష్టిస్తారు. తరువాత హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసి, కేరళ తదితర దక్షిణాది రాష్ట్రాల్లోని కొనుగోలుదారులకు భారీ ధరలకు ఆ కార్లను విక్రయిస్తుంటారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు రోహిత్ బేడీపై ఐపిసి సెక్షన్ 406 (నమ్మక ద్రోహం), 420 (చీటింగ్) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ అనూప్ సి నేతృత్వంలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కొనుగోలుకు సంబంధించిన పత్రాలను, బ్యాంక్ లావాదేవీల వివరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ స్మగ్లింగ్ రాకెట్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



# జనవరిలోనే మోడీకి కొత్త ఆఫీస్

**న్యూఢిల్లీ :** సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం పూర్తయి.. అందులోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. తాజాగా, ప్రధాని నరేంద్ర మోదీ కొత్త కార్యాలయం ‘సేవా తీర్థ్’ సిద్ధమైంది. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ అత్యాధునిక కార్యాలయం ఈ నెలలోనే అందుబాటులోకి రానుంది. ఇందులో ప్రధాని ఆఫీసు, క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయాలు ఉంటాయి. సౌత్, నార్త్ బ్లాక్‌లను పురాతన భారతీయ నాగరికతను తెలిపే మ్యూజియంగా మార్చనున్నారు.ఢిల్లీలోని రైసినా హిల్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్త కార్యాలయం దాదాపు సిద్ధమయ్యింది. భవనానికి తుది మెరుగులు దిద్దుతుండగా.. కొత్త ఆఫీసులోకి ప్రధాని మోదీ ఈ నెలలోనే అడుగుపెట్టను న్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా రైసినా హిల్‌లో ప్రధాన మంత్రి కార్యాలయం నిర్మాణం చేపట్టారు. దీనికి ‘సేవా తీర్థ’ అని నామకరణం చేశారు. ఇందులో మొత్తం మూడు భవనాలు ఉండగా.. ఒకటి ప్రధాని ఆఫీసు, రెండోది క్యాబినెట్ సెక్రటేరియట్, మూడోది జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఏర్పాటుచేస్తున్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో ఇప్పటికే పార్లమెంట్ భవనం, ఉప-రాష్ట్రపతి నిలయం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.ప్రధాని కార్యాలయం దాదాపు పూర్తి కాగా.. ఎనిమిది మంత్రిత్వ శాఖల భవనాల్లో మూడు ఇప్పటికే అందుబాటులోకి వచ్చి కార్యకలాపాలు మొదలయ్యాయి. కాగా, గతంలో ప్రధాని ఆఫీసుకు ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ అనే పేరును సూచించారు. కానీ తర్వాత దానిని సేవా తీర్థ్ (సేవకు పవిత్ర స్థలం అని అర్థం) అని నామకరణం చేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కొత్త కార్యాలయానికి సమీపంలోనే ప్రధాన మంత్రి నివాసం కూడా నిర్మిస్తున్నారు. అది సిద్ధమయ్యాక, ఆయన 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని నివాసం నుంచి అక్కడికి మారతారు.సేవా తీర్థ్‌లో ప్రముఖులను కలిసేందుకు అత్యాధునిక గదులు ఉన్నాయి. ఈ గదులు సాంకేతికంగా అన్ని సౌకర్యాలతో ఉండటమే కాకుండా, భారత సంస్కృతి, సంప్రదాయాలను కూడా ప్రతిబింబిస్తాయి. క్యాబినెట్ సమావేశాల కోసం ప్రత్యేకంగా ఓ హాలును రూపొందించారు. ప్రధాన మంత్రి కార్యాలయం ఇప్పుడు ఓపెన్ ఫ్లోర్ నమూనాలో ఉంది. ఇది వర్క్ కల్చర్‌లో మార్పులను తీసుకురావడానికేనని అధికారులు చెబుతున్నారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్‌లోని రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలతో కలిసి ఉంది. నార్త్ బ్లాక్‌లో హోమ్, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ఉండేవి. వీటిని ప్రస్తుతం కర్తవ్య భవన్‌లోని మార్చారు. బ్రిటిష్ కాలం నాటి ఈ సౌత్, నార్త్ బ్లాక్‌లను 5 వేల ఏళ్ల నాటి పురాతన భారతీయ నాగరికతను తెలియజేసే మ్యూజియంగా మార్చుతున్నారు. దీనికి సంబంధించిన తొలి దశను వచ్చే ఏడాది ప్రథమార్థంలో ప్రారంభించనున్నారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ..



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ఉపయోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆమె ఆరోపించారు. దీనివల్ల నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె అన్నారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆమె లేఖ రాశారు. ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఆమె ఈసీకీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారని, అయితే ఈ ప్రక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇది పెద్ద ఎత్తున డేటా మిస్ మ్యాచ్‌కు దారి తీసిందని, దీనివల్ల నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఈసీ ఇప్పుడు పక్కన పెట్టిందని ఆమె ఆరోపించారు. దీనితో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీ ఎప్పటినుంచో వస్తున్న తన సొంత పద్ధతులను విస్మరించడాన్ని ఆమె ఖండించారు. ఇది ఏకపక్షంగా, అహేతుకంగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అన్నారు. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ ప్రక్రియలోనే లోపం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా వరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోందని, సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు.

## మిత్రుల మధ్య విభేదాలు సహజమే..




తమ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనని భారత్‌కు నూతన అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ పేర్కొన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమని, ట్రంప్, మోదీల మధ్య విభేదాలు కూడా అలాంటివేనని అన్నారు. వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగడానికి వారు ప్రయత్నిస్తారని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్ద దేశమని, రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని గోర్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. భద్రత, సాంకేతికత, ఆరోగ్యం, ఇంధనం వంటి రంగాల్లో కూడా రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని అన్నారు. భారతదేశమే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జనవరి 13న ఇరు దేశాల ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నట్లు సెర్గియో గోర్ వెల్లడించారు.

## రిస్క్ తీసుకుంటేనే ఉన్నత స్థానం

స్వామి వివేకానంద జీవితం ఎంతో మందికి ఆదర్శ ప్రాయమని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ 2026 ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరయ్యారు. యువత రిస్క్ తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడకూడదని మీ విజయం దేశాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. 2047 వికసిత్ భారత్ ప్రయాణం దేశ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. 2014లో తాను ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వారిలో అక్కడున్న వారిలో చాలామంది చిన్నపిల్లలని అక్కడి యువతనుద్దేశించి మోదీ మాట్లాడారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో అనేక మార్పులు తెచ్చామని ఐఐటీలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. యువత చాలా యాక్టివ్‌గా ఉండాలని ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ యువతకు సూచించారు. నేడు స్వామివివేకానంద జయంతి ఈ రోజును భారత్ జాతీయ యువజన దినంగా జరపుకుంటుంది.

## అత్యాధునిక టెక్నాలజీతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు



నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ), రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ కలిసి బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ (బీఎ-544+)లో అసాధారణ వేగంతో రహదారి నిర్మాణం చేసి నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం తెలిసిందే. కేవలం ఆరు రోజుల్లోనే 156 లేన్ కిలోమీటర్లు (అంటే 52 కిలోమీటర్ల స్ట్రెచ్‌లో 3-లేన్ వెడల్పు) నిరంతరంగా పేవింగ్ చేశారు. అందులో ఒక రోజు, జనవరి 6న 24 గంటల్లోనే 28.8 కిలోమీటర్లు పూర్తి చేశారు అదే సమయంలో 10,675 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్ వేయడం కూడా ఒక ప్రపంచ రికార్డు.

57,500 మెట్రిక్ టన్నుల బిటుమిన్ నిరంతరంగా వేయడం, మరియు మొత్తం 156 లేన్ కి.మీ. పేవింగ్‌తో పాత రికార్డులను మించిపోయారు. ఇవన్నీ ఆధునిక మెషినరీ, భారీ టీమ్ వర్క్‌తో, నాణ్యతలో ఏమాత్రం రాజీ లేకుండా సాధించారు. ఇది ఆరు లేన్ హైవేల్లో జరిగిన అద్భుతం. ఈ పనితీరుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు కురిపించారు. మన ఇంజినీర్లు, అధికారులు అసాధ్యాన్ని సాధ్యం చేశారని, నూతన సాంకేతికతతో త్వరగా, నాణ్యమైన రోడ్లు నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ పనులపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ నాలుగు గిన్నిస్ రికార్డులు దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని, నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచ స్థాయిలో సాధించామని ప్రత్యేకంగా రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్‌ను అభినందించారు. ఈ రోడ్ పూర్తయితే బెంగళూరు-విజయవాడ మధ్య దూరం 100 కిలోమీటర్లు తగ్గి, ప్రయాణ సమయం 12 గంటల నుంచి 8 గంటలకు తగ్గుతుంది. రాయలసీమ, తీర ప్రాంతాలు బాగా కనెక్ట్ అవుతాయి.

ధర్మఘంట

# మున్సిపోల్స్‌కు గులాబీ దళం సన్నద్ధం

**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలను గులాబీ బాస్ కేసీఆర్ ప్రస్తావించడంతో..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీరియస్‌గా తీసుకుంటున్నారట. మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారట.వచ్చే నెలలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. పదవీకాలం ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ మధ్యే జరిగిన పంచాయితీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సర్పంచులను గెలుచుకున్నా..4 వేలకు పైగా స్థానాలను గెలిచి బలమైన పోటీ ఇచ్చామని ప్రతిపక్ష బీఆర్ఎస్ చెబుతూ వస్తోంది.అయినా పంచాయతీ ఎన్నికల ఫలితాలపై గులాబీ బాస్ కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయ్. కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలిచి ఉండాల్సిందని పార్టీ నేతలతో జరిగిన అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. పంచాయితీ ఎన్నికలు కనుక పార్టీ గుర్తుపై జరిగి ఉంటే..బీఆర్ఎస్ సత్తా ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసేదని కేసీఆర్ అన్నారట.గుర్తు లేకుండా జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పారని కేసీఆర్ ఇంటర్నల్ మీటింగ్‌లో కామెంట్ చేశారట. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగి ఉంటే ఫలితాలు మరోలా ఉండేదని ఓ రకంగా ఛాలెంజ్ చేసిన కేసీఆర్..ఇప్పుడు పార్టీ గుర్తులతో జరుగబోతున్న మున్సిపల్ ఎన్నికలపై స్పెషల్ కాన్సన్‌ట్రేషన్ పెట్టారట.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మించి కాకపోయినా ఆ పార్టీతో సరిసమానంగానైనా స్థానాలను గెలవాలన్న పట్టుదలతో ముందుకు వెళ్తోందట బీఆర్ఎస్. కేటీఆర్ మున్సిపల్ ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి పెట్టారట.




అందుకే ఉమ్మడి జిల్లాల వారిగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ నేతలకు మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్ధేశం చేస్తున్నారట.మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహిస్తారని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగితే సత్తా చాటేవాళ్లమన్న తమ అధినేత నమ్మకాన్ని నిలబెట్టేలా మున్సిపల్ ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను గెలుచుకునేలా కేటీఆర్ గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశారట.రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఆగ్రహంగా ఉన్నారని బీఆర్ఎస్ భావిస్తోందట. మరి మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటీలో ఎవరిది పైచేయి అవుతుందో.? కారు పార్టీ ఎక్స్‌పెక్టేషన్స్‌ను రీచ్ అవుతుందో లేదో చూడాలి మరి.

# విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్


**నల్గొండ :** హైదరాబాద్ నుండి ఏపీకి వెళ్లే ప్రయాణికులతో సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచే వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వాహనాలు వేగంగా ముందుకు సాగేలా అధికారులు అదనపు టోల్ బూత్‌లను అందుబాటులోకి తెచ్చారు.శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు సుమారు 70 వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఆదివారం కావడతో నేడు రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో టోల్ వద్ద అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశారు. కానీ వాహనాలు ఒకేసారి వేల సంఖ్యలో వస్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా సాంకేతిక ఏర్పాట్లు చేయడంతో పాటు, పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద అత్యవసర సేవల కోసం అంబులెన్స్, క్రేన్, పెట్రోలింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచారు. ఏపీలోని నందిగామ వై-జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు కొంత ఇబ్బంది పడుతున్నారు. సంక్రాంతి సంబరాల వేళ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆర్టీసీ బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగకు మరో రెండు రోజులే సమయం ఉండటంతో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ సొంతూళ్లకు చేరుకోవడానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యంగా



హైదరాబాద్ నుండి ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే జనం సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ ఖమ్మంతో పాటు ఇతర జిల్లాలకు ప్రత్యేక బస్సులను నడుపుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తోంది.శనివారం నుండి సెలవులు కావడంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పండుగకు ముందే సిద్ధమయ్యారు. రెండు రోజులుగా హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా కనిపిస్తుంది. హైదరాబాద్‌లో జాబ్ చేసే వారితో పాటు స్థిరపడిన ఏపీ వారంతా తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. రైళ్లు, బస్సులతో పాటు సొంత వాహనాల్లో సొంతూళ్లకు వెళ్తున్నారు. వ్యక్తిగత వాహనాల్లో సొంతూళ్లకు ఎక్కువ మంది వెళ్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు క్యూకడుతున్నాయి.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. చదువు రాని వారిని, అమాయకులనే కాదు.. బాగా చదువుకున్న వారిని కూడా ఇట్టే మోసం చేస్తున్నారు. ఏ మాత్రం డౌట్ రాకుండా పని కానిస్తున్నారు. మాయ మాటలతో నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారు. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి భార్యకే సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఏకంగా 2 కోట్ల రూపాయలు కొట్టేశారు. సైబర్ క్రిమినల్స్ చేతిలో మాజీ ఐపీఎస్ భార్య మోసపోయిన వైనం హైదరాబాద్ లో వెలుగుచూసింది.ఇది ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్ కేసు. మాజీ ఐపీఎస్ అధికారి భార్య రూ.2.58 కోట్లు మోసపోయింది. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చిట్కాలు ఇస్తామని వాట్సాప్ నుంచి ఆమెకు సందేశం వచ్చింది. అయితే, దాని గురించి ఆమెకు అవగాహన లేదు. దాంతో ఆమె తన భర్తను వాట్సాప్ గ్రూప్ లో యాడ్ చేయించింది. ఇక సైబర్ నేరగాళ్లు తమ పని మొదలు పెట్టారు. 500 శాతం లాభాలు వస్తాయని ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించారు.



ఒక లింక్ పంపిన సైబర్ మోసగాళ్లు.. సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని ఆమెను నమ్మించారు. వాట్సాప్ లో సెబీ నకిలీ సర్టిఫికెట్లు కూడా పంపారు. అది చూసి ఆమె పూర్తిగా నమ్మేసింది. 500శాతం లాభాలు అనగానే టెంప్ట్ అయ్యింది.ఆ తర్వాత డబ్బులు ఇన్వెస్ట్ మెంట్ చేయడం ప్రారంభించింది. అలా డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5 వరకు 19 లావాదేవీలు చేసింది. మొత్తం 2.58 కోట్లు పంపింది. ఆ తర్వాత డబ్బులు పంపడం ఆపేసింది. అయితే, మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని సైబర్ క్రిమినల్స్ ఆమెపై ఒత్తిడి పెంచారు. ఇన్వెస్ట్‌మెంట్ చేయకపోతే ఇప్పటివరకు పెట్టిన డబ్బు పోతుందని భయపెట్టారు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు లబోదిబోమంది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.సైబర్ క్రైమ్స్ గురించి పోలీసులు నిత్యం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. లాభాల పేరుతో జరిగే మోసాల గురించి హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని చెబుతూనే ఉన్నారు. అయినా ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. అత్యాశతో, అమాయకత్వంతో అడ్డంగా మోసపోతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకుంటున్నారు.

## నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ

**హైదరాబాద్:** ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు తెచ్చినట్టు చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, ఎంఐఎంపై సంచలన విమర్శలు గుప్పించారు. ఎంఐఎం సూచనలు బీజేపీకి అవసరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'ఉపాధి హామీ కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించాం. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చాం. వంద రోజుల పని దినాలను 125కి పెంచాం. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నాం. వ్యవసాయ పీక్ సీజన్‌లో కూలీల కొరత లేకుండా ఈ పథకంతో లబ్ది జరుగుతుంది. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా కొత్త చట్టం చేశాం. రాష్ట్రాలకి అదనపు భారం వేయడమే కాదు.. కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కేంద్రం కూడా 340 కోట్లు లాస్ట్ ఇయర్ కంటే ఎక్కువ రాష్ట్రానికి వస్తాయి. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడం జరిగింది. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాం. పథకాన్ని నీరుగార్చడం కాదు పటిష్ఠం చేశాం. కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రాలు కూడా బాధ్యత కూడా తీసుకోవాలి. కాంగ్రెస్ దేశంలో రెండు మూడు చిన్న రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది అని చెప్పుకొచ్చారు.

**బీఆర్ఎస్‌కు కౌంటర్..**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి..'బీఆర్ఎస్ పని అయిపోయింది. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించాం కదా. గాలివాటం అయితే దేశంలో మూడు సార్లు అధికారంలోకి వస్తామా?. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారు. ఎవరిది గాలివాటమో ప్రజలకు తెలుసు' అని అన్నారు.

**ఎంఐఎంపై వ్యాఖ్యలు..**

పాకిస్తాన్‌లో హిందువులు లేకుండా చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు. ముస్లిం మహిళ ప్రధాని కావాలని ఎంఐఎం నేత అనడంలో ఉద్దేశం ఏంటి?. దేశ ప్రజలను భయపెట్టే చర్యగా ఎంఐఎం నేతలు ఉన్నారు. అవగాహన లేకుండా దుందుడుకుగా వ్యవహరించడం అసద్‌కు అలవాటు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ చేసి పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాదులను మట్టుపెట్టారు. దేశం అభివృద్ధి చేసుకోవాలనే దృష్టి పెట్టాం. దేశ రక్షణకు మోదీ అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఎంఐఎం సూచనలు మాకు అవసరం లేదు అని ఘాటుగా విమర్శలు చేశారు.

## ఉద్యోగులే ప్రభుత్వ సారథులు.. వారధులు

తాను ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకోవాలని అనుకున్నప్పటికీ ఏదో ఒక పని వచ్చిపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులని, వారధులని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగుల్లో కూడా తనను ఇష్టపడని వారు ఉండొచ్చని, తాను వచ్చిన తరువాత ఉద్యోగుల వేతనాలు ఎలా అందుతున్నాయో గమనించాలని అన్నారు. ఉద్యోగుల డీఏ ఫైళ్లపై సంతకం చేసి ఇక్కడికి వచ్చానని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.1 కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అన్నారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయని అన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూలు చేస్తే చాలని వ్యాఖ్యానించారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## సంక్రాంతి కానుకగా..

-మొదటిపేజీ తరువాయి

చెల్లింపులు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 2026లో పెన్షన్ మరియు డీఆర్ చెల్లింపులు పూర్తిగా అమలులోకి వస్తాయి. ఈ పెంపు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ గ్రాంట్స్ పొందుతున్న వారికి వర్తించదు. కేవలం పెన్షన్ పొందుతున్న వారికి మాత్రమే ఈ లాభం అందుతుంది.

**జిల్లాల పునర్విభజనపై సీఎం రేవంత్ కీలక ప్రకటన**

తెలంగాణలో జిల్లాల పునర్విభజనపై సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు. త్వరలో ఈ అంశంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. 'జిల్లాల సరిహద్దులు మార్చాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. అందుకే జిల్లాల పునర్విభజన కోసం ఒక రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయనున్నాం. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.


జిల్లాల పునర్విభజనపై అసెంబ్లీలో చర్చ జరిపి, సభ్యుల సలహాలు తీసుకున్నాకే తుది నిర్ణయం తీసుకుంటాం. ఈ అంశంపై అపోహలు పెట్టుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ముందుగా మండలాల రేషనలైజేషన్, తర్వాత రెవెన్యూ డివిజన్ల రేషనలైజేషన్, ఆ తర్వాతే జిల్లాల పునర్విభజన జరుగుతుంది' అని తెలిపారు.

**రైతులకు గుడ్ న్యూస్**

సంక్రాంతి వేళ తెలంగాణ ప్రభుత్వం రైతులకు కూడా శుభవార్తను అందించింది. సన్న వరిధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ నిధులను పౌరసరఫరాల శాఖ విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో సన్నరకం వడ్లు పండించిన రైతులకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన నిధులతో కలిపి ఈ సీజన్‌లో ప్రభుత్వం మొత్తం రూ.1,429 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత వారి వివరాలను నమోదు చేసుకుని, మద్దతు ధరతో పాటు బోనస్ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నారు.

## 'వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే'

-మొదటిపేజీ తరువాయి



ఉన్నప్పుడే తీసుకుంటే కిందకు వెళ్లవు. ఈ విషయంలో పాత బాస్‌కు కోపం రావద్దు.. కేసీఆర్‌కు పేరు రావద్దనేది రేవంత్ ఆలోచన. రేవంత్ రెడ్డి నిజాయతీ గల మోసగాడు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ చెప్పేవారు. పదేపదే మోసపోతే ప్రజలదే తప్పు అవుతుంది. అభివృద్ధి పనులకు డబ్బులు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు. డబ్బులు మూటలు కట్టి దిల్లీకి పంపితే రాష్ట్రంలో పనులకు ఎలా వస్తాయి? ఆంధ్రా కాంట్రాక్టర్లకు సీఎం పెద్దపీట వేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యేనే అంటున్నారు. తమ ప్రభుత్వం వస్తుందో? రాదో? తెలియదు. హామీ ఇవ్వనని జూపల్లి చెప్పారు. హామీలు, పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే దూషిస్తున్నారు. అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**ఇప్పుడు గుర్తులు ఉంటాయ్..**

"సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేకుండా ఎన్నికలు జరిగాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు ఉంటుంది. మున్సిపల్ ఎన్నికల్లో మన పార్టీ సత్తా ఏంటో చూపించాలి. కేవలం కేసీఆర్, కారు గుర్తును మాత్రమే గుర్తు పెట్టుకోవాలి. అన్నీ ఆలోచించే అభ్యర్థిని బీఆర్ఎస్ నిలబెడుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేకపోయినా కేసీఆర్ ఉంటారని ప్రజలు భావించారు. ఎమ్మెల్యేలు లేకుంటే కేసీఆర్ ఎలా ఉంటారనే లాజిక్ మరిచారు. అందుకే, మళ్లీ తప్పు చేయకుండా, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలి. రెండేళ్ల తర్వాత కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పనులు పరుగులు పెడతాయి. కొడంగల్ సహా 14 స్థానాల్లో కాంగ్రెస్‌ను ఈసారి ప్రజలు బొందపెడతారు. జిల్లాలను ముట్టుకుంటే అగ్గి రగులుతుంది. కాంగ్రెస్‌ను దహించివేస్తుంది" అని కేటీఆర్ అన్నారు.

ధర్మఘంట



# రోజూ రెండు ముక్కలు

బొప్పాయి.. ఎన్నో పోషకాలతో నిండిన ఈ పండు ప్రతి సీజన్‌లో దొరుకుతుంది. దీనిని రెగ్యులర్‌గా తింటే చాలా లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి. బొప్పాయి పండు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ శరీరంలో మంచి మార్పులని తీసుకొస్తాయి. రోజూ తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. జీర్ణ సమస్యలు..రోజూ ఈ పండుని తీసుకోవచ్చు. ఈ పండులో బైపాన్ ఎంజైమ్ ఉంటుంది. దీని వల్ల అజీర్ణ సమస్యలు, ఊబకాయం వంటి సమస్యలు దూరమవుతాయి. ముఖ్యంగా రోజూ పరగడపున 2 బొప్పాయి ముక్కలు తీసుకుంటే చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు.మలబద్ధకం..శరీరంలో అనేక సమస్యలకి దీర్ఘకాలిక మంట కారణం. ఇందుకోసం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఫుడ్స్ తీసుకోవాలి. అందుకే కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకుంటే మంచిది. బొప్పాయి రెగ్యులర్‌గా తీసుకుంటే శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.గుండె ఆరోగ్యం..బొప్పాయి పండులో విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ పుష్కలంగా ఉంది. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి మంచివి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ గుండె ఆరోగ్యాన్ని కాపాడి చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.క్యాన్సర్ నివారణకు..బొప్పాయిలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి ఆడవారిలో బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా చేస్తాయి.

# చలికాలంలో చియా సీడ్స్ అద్భుతాలు



చర్మానికి హైడ్రేషన్ కవచం: చియా గింజలకు నీటిని పీల్చుకునే గుణం చాలా ఎక్కువ. ఇవి తమ బరువు కంటే 10-12 రెట్లు ఎక్కువ నీటిని నిల్వ చేసుకోగలవు. వీటిని నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరం లోపల హైడ్రేటెడ్‌గా ఉంటుంది.దీనివల్ల చర్మం పొడిబారకుండా, తేమతో మెరుస్తూ కనిపిస్తుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ నిధి: ఆరోగ్యకరమైన చర్మానికి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చాలా అవసరం. చియా గింజల్లో ఇవి పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై రక్షణ పొరను ఏర్పరిచి, బయటి కాలుష్యం నుంచి కాపాడటమే కాకుండా చర్మాన్ని మృదువుగా ఉంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లతో యవ్వనంగా: చియా గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఇది వృద్ధాప్య ఛాయలను తగ్గించి, ముఖంపై సహజమైన మెరుపును తీసుకొస్తుంది. కొల్లాజెన్ : చర్మం బిగుతుగా ఉండటానికి కొల్లాజెన్ అనే ప్రోటీన్ ముఖ్యం. చియా గింజల్లో ఉండే అమైనో ఆమ్లాలు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ఫలితంగా చర్మం సాగకుండా, యవ్వనంగా కనిపిస్తుంది. లోపలి నుండి శుభ్రం: జీర్ణక్రియ బాగుంటేనే ముఖం వెలుగుతుంది అనేది అక్షర సత్యం. చియా గింజల్లో పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. శరీరం లోపల వ్యర్థాలు తొలగిపోతే, ఆ ప్రభావం నేరుగా చర్మంపై కనిపిస్తుంది. వాపులు, మొటిమల నియంత్రణ: చియా గింజలకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మంపై వచ్చే ఎరుపు, వాపు, మొటిమలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.

# మసాలా దినుసుగా ఉపయోగపడే పువ్వు..



భారతీయ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. వీటిని అనేక రకాల వంటకాల్లో మనం విరివిగా ఉపయోగిస్తూ ఉంటాం. మనం వంటల్లో వాడే ఈ సుగంధ ద్రవ్యాలన్నీ కూడా మన ఆరోగ్యానికి మేలు చేసేవే. మనం వాడే సుగంద ద్రవ్యాల్లో అనాస పువ్వు కూడా ఒకటి. ఇది చూడడానికి స్టార్ ఆకారంలో చూడగానే ఆకట్టుకునే విధంగా ఉంటుంది. వంటల్లో దీనిని వేయడం వల్ల వాటి వాసనతో పాటు రుచి కూడా పెరుగుతుంది. వంటల్లో వాడడంతో పాటు ఈ అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఈ నీటిని తీసుకోవడం వల్ల మనం అధిక ప్రయోజనాలను పొందవచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, బరువు తగ్గడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా అనాస పువ్వు నీరు మనకు సహాయపడుతుంది.

**జీర్ణ సమస్యలకు..**

అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి, అలాగే ఈ నీటిని ఎలా తయారు చేసుకోవాలి.. అన్న వివరాలను వైద్యులు వివరిస్తున్నారు. అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన శరీర బరువు అదుపులో ఉంటుంది. వీటిలో ఉండే పాలీఫినాల్స్, టెర్పెనాయిడ్లు శరీర జీవక్రియలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. అనాస పువ్వులో అనెథోల్ అనే రసాయన సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అనాస పువ్వులతో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి. ఈ పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటితో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఇన్ఫెక్షన్ లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇటువంటి సమయంలో ఈ నీరు మనకు ఎంతో ఉపయోగపడుతుంది.

**సీజనల్ వ్యాధులకు..**

ఈ నీటిని తరచూ తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ లు తగ్గుతాయి. అంతేకాకుండా ఈ నీటిని తీసుకోవడం వల్ల చర్మానికి మేలు కలుగుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని కాపాడుతాయి. కనుక ఈ నీటిని తాగడం వల్ల చర్మం పొడిబారడం, మొటిమలు వంటి సమస్యలు తగ్గుతాయి. అనాస పువ్వు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. వీటితో చేసిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో మంట, వాపు వంటి సమస్యలు తగ్గుతాయి. ఇలా అనేక విధాలుగా అనాస పువ్వు నీరు మనకు మేలు చేస్తుంది. ఇక ఈ నీటిని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం.
ఒక గిన్నెలో రెండు కప్పుల నీటిని తీసుకుని అందులో 3 లేదా 4 అనాస పువ్వులను వేసి నీరు రంగు మారే వరకు బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవచ్చు. ఈ విధంగా అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మినుములను చాలా మంది పట్టించుకోరు.. కానీ వీటితో ఎన్ని లాభాలు

మన శరీరానికి పప్పు దినుసులు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ప్రోటీన్ తో పాటు ఇతర ముఖ్యమైన పోషకాలు ఎన్నో లభిస్తాయి. రోజూ పప్పు దినుసులను ఆహారంలో భాగంగా తీసుకోవడం మన శరీరానికి ఎంతో అవసరం. మనం ఆహారంగా తీసుకునే పప్పు దినుసుల్లలో మినుములు కూడా ఒకటి. వీటిని పొట్టుతో, మర ఆడించి పొట్టు లేకుండా కూడా తీసుకుంటూ ఉంటారు. మినుములతో మనం అనేక రకాల వంటకాలను తయారు చేస్తూ ఉంటాం. దోశ, వడ, ఇడ్లీ, కిచిడీ వంటి వాటితో పాటు సున్నుండలు, మురుకులు వంటి పిండి వంటకాలను కూడా తయారు చేస్తూ ఉంటాం. మినుములతో చేసే వంటకాలను తీసుకోవడం వల్ల మనం రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు. మినుముల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని రోజు వారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.జీర్ణ వ్యవస్థకు..మినుముల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిలో కరిగే, కరగని ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. మనం తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మలబద్ధకం సమస్యతో బాధపడే వారు మినుములను పొట్టుతో సహా తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మినుముల్లో మెగ్నీషియంతో పాటు పొటాషియం కూడా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటుతో బాధపడే వారికి మినుములు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. మినుములను తీసుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మినుముల్లో క్యాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో, ఎముకలను దృఢంగా చేయడంలో, ఎముకల సాంద్రతను పెంచడంలో దోహదపడతాయి.



ఐరన్ అధికంగా..మినుముల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ లోపం లేకుండా ఉంటుంది. దీంతో శరీరంలో ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉంటుంది. శరీరమంతా ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. దీని వల్ల శరీర అలసట తగ్గుతుంది. తరచూ నీరసం, అలసట వంటి సమస్యలతో బాధపడే వారు మినుములను తీసుకోవడం వల్ల అలసట తగ్గడంతో పాటు శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. మినుముల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ తో పోరాడడం వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మినుములు మనకు దోహదపడతాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల మన శరీరంలోకి క్యాలరీలు తక్కువగా చేరుతాయి. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది.
ఇతర పోషకాలు..ఇక మినుములలో జింక్, బి విటమిన్లు కూడా ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ విధంగా మినుములు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యానికే మేలు కలుగుతుందని వారు చెబుతున్నారు. పిల్లలకు కూడా మినుములతో చేసిన ఆహారాలను ఇవ్వడం వల్ల వారిలో ఎదుగుదల చక్కగా ఉంటుందని వారు సూచిస్తున్నారు.

# బరువు తగ్గడానికి ఏది బెస్ట్..?



సాయంత్రం 4 లేదా 5 గంటలవుతుందంటే చాలు.. ఏదైనా కరకరలాడే స్నాక్ తినాలని మనసు లాగుతుంటుంది. ఆ సమయంలో వంటింట్లో డబ్బా తెరిస్తే మనకు కనిపించే రెండు ముఖ్యమైన ఆప్షన్లు..పల్లీలు, మఖానా. ఈ రెండూ ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ.. బరువు తగ్గడం విషయానికి వస్తే ఏది మంచిది..? అనే డౌట్ అందరిలో ఉంటుంది. ఆ విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం..పల్లీ శక్తి కేంద్రాలుదశాబ్దాలుగా మన ఇళ్లలో వేరుశనగలు అత్యంత ఇష్టమైన చిరుతిండి. వీటిని పేదల బాదం అని కూడా పిలుస్తారు. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినకుండా నియంత్రిస్తాయి. పల్లీలలో కేలరీలు చాలా ఎక్కువ. రోజుకు ఒక చిన్న గుప్పెడు తింటే పరవాలేదు కానీ, రుచిగా ఉన్నాయని గిన్నెలు గిన్నెలు తింటే బరువు తగ్గడానికి బదులు పెరగడం ఖాయం. మఖానా: వెయిట్ లాస్ స్పెషలిస్ట్గత కొన్ని ఏళ్లుగా ఫిట్‌నెస్ ప్రేమికులకు మఖానా హాట్ ఫేవరెట్ అయిపోయింది. ఇవి చాలా తేలికగా ఉంటాయి. కేలరీలు, కొవ్వు శాతం చాలా తక్కువ. పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక గొప్ప వరం. మఖానాను నెయ్యిలో లేదా నూనెలో వేయించి, ఉప్పు ఎక్కువగా కలిపి తింటే దాని అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. సాధ్యమైనంత వరకు డ్రై రోస్ట్ చేయడం లేదా అతి తక్కువ నెయ్యితో వేయించడం ఉత్తమం. బరువు తగ్గడంలో విజేత ఎవరు?బరువు తగ్గే రేసుల మఖానా ముందుంటుంది. మీరు ఒక కప్పు మఖానా తిన్నా కూడా శరీరానికి అందే కేలరీలు చాలా తక్కువ. ఇది మీ కడుపుని నింపుతుంది కానీ బరువును పెంచదు. అదే పల్లీల విషయానికి వస్తే.. ఒక కప్పు మఖానాకు సమానమైన కేలరీలను పొందాలంటే కేవలం 10-15 వేరుశనగ గింజలు తింటే చాలు. కానీ అన్ని గింజలతో కడుపు నిండిన భావన రాదు, ఫలితంగా మనం ఎక్కువ తినే ప్రమాదం ఉంటుంది.

# కరీంనగర్ జిల్లాలో మార్పులు


**కరీంనగర్ :** హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపడం ఖాయమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజల అభీష్టానికి విరుద్ధంగా హుస్నాబాద్‌ను సిద్దిపేటలో కలిపిందని.. శాస్త్రీయంగా సరిహద్దులు మార్చినప్పుడు దీనిని పాత జిల్లాలోనే చేరుస్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు.. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాల సరిహద్దుల సవరణపై ప్రకటన చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఇదే క్రమంలో వంగర కేంద్రంగా 'పి.వి. నరసింహారావు జిల్లా' ఏర్పాటు చేయాలని ప్రజలు ధర్నాలు చేస్తున్నారు. పరిపాలనను సులభతరం చేసేలా జిల్లాల పునర్విభజన ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటోంది. తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజన వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలన్న డిమాండ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయిహుస్నాబాద్ నియోజకవర్గంలోని జిల్లెలగడ్డలో అర్బన్ పార్కుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. గత ప్రభుత్వం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హుస్నాబాద్‌ను సిద్దిపేట జిల్లాలో కలిపిందని ఆయన విమర్శించారు. భౌగోళికంగా, పరిపాలనా పరంగా హుస్నాబాద్ ప్రజలకు కరీంనగర్‌తోనే విడదీయలేని అనుబంధం ఉందని గుర్తు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల సరిహద్దుల మార్పులు చేపట్టినప్పుడు హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపడం ఖాయమని ఆయన భరోసా ఇచ్చారు. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీని ఇప్పుడు ముఖ్యమంత్రిగా అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల అసెంబ్లీ వేదికగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాల పునర్వ్యవస్థీకరణపై చేసిన ప్రకటన ఈ చర్చకు మరింత బలాన్ని చేకూర్చింది. గతంలో రాజకీయ లబ్ధి కోసమే చిన్న జిల్లాలను ఏర్పాటు చేశారని.. దీనివల్ల పాలనలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.




జనాభా, విస్తీర్ణం, ప్రజల సౌకర్యాన్ని బట్టి జిల్లాల సరిహద్దులను సవరించేందుకు ఒక నిపుణుల కమిటీని వేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందిహుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపడంతో పాటు.. రాష్ట్రవ్యాప్తంగా అశాస్త్రీయంగా విడిపోయిన మరికొన్ని మండలాలను పాత జిల్లాల్లో చేర్చాలని విజ్ఞప్తులు అందుతున్నాయి. ప్రభుత్వం వీటిని క్షుణ్ణంగా పరిశీలించి మున్సిపల్ ఎన్నికల లోపే ఒక స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. సర్వాయి పాపన్న పార్క్: జిల్లెలగడ్డ అర్బన్ పార్కుకు చారిత్రక నేపథ్యం ఉన్నందున దానికి 'సర్వాయి పాపన్న అర్బన్ పార్క్' అని పేరు పెట్టాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన సాగించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వార్తల నేపథ్యం లో మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు జన్మస్థలమైన వంగరను కేంద్రంగా చేసుకుని 'పి.వి. నరసింహారావు జిల్లా'ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. హుజూరాబాద్ లేదా ఇతర సమీప ప్రాంతాలను కలిపి ఆయన పేరుతో జిల్లాను ప్రకటించాలని ఇప్పటికే పలు ప్రాంతాల్లో ధర్నాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ మొదలైతే హుస్నాబాద్ మార్పు అనేది ఒక ఆరంభం మాత్రమే అవుతుందని.. మరిన్ని జిల్లాలు, మండలాల సరిహద్దుల్లో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వరంగల్ జిల్లాలకు మహర్దశ

**వరంగల్ :** ఓరుగల్లు అభివృద్ధిలో మామునూర్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ కీలక మైలురాయిగా మారనుంది. వరంగల్ వాసుల దశాబ్దాల కల నెరవేరుస్తూ.. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 295 కోట్లు విడుదల చేసింది. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ రవాణా , పారిశ్రామిక రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయి. దీనితో పాటు కాజీపేట రైల్వే తయారీ కేంద్రం, మెగా టెక్స్‌టైల్ పార్క్ , 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఓఆర్ఆర్ వంటి భారీ ప్రాజెక్టులకు కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రధాని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇవి ప్రారంభం కానున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం ఓరుగల్లు. ముఖ్యంగా వరంగల్ వాసుల దశాబ్దాల కల అయిన మామునూర్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ పనులు ఈ ఏడాది పట్టాలెక్కబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే నిధులను కేటాయించడమే కాకుండా.. పాత నిబంధనలను సడలించి పనులు మొదలుపెట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ జిల్లాల ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. మామునూర్ విమానాశ్రయం కోసం దాదాపు 253 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రూ. 295 కోట్లను విడుదల చేసింది. గతంలో హైదరాబాద్ విమానాశ్రయ ఒప్పందం ప్రకారం 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్ట్ ఉండకూడదనే నిబంధన ఉండేది. అయితే ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ అడ్డంకులను తొలగించింది. ఈ విమానాశ్రయంతో పాటు నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు పనులు కూడా వేగవంతం కానున్నాయి.



ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్, టెక్స్‌టైల్ పార్క్‌ను అనుసంధానం చేస్తూ నిర్మించే రహదారులు నగర రవాణా వ్యవస్థను అగ్రస్థానంలో నిలబెట్టనున్నాయి.కేవలం విమానాశ్రయమే కాకుండా, మరికొన్ని భారీ ప్రాజెక్టులు కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే తయారీ కేంద్రం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. సుమారు రూ. 521 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ఉపాధి లభించనుంది. అలాగే.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ కూడా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలుపెట్టనుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం 'పీఎం మిత్ర' పథకం కింద అదనపు నిధులు కేటాయించడంతో వస్త్ర పరిశ్రమలో వరంగల్ గ్లోబల్ హబ్‌గా మారే అవకాశం ఉంది.వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయి. సుమారు రూ. 1,800 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రి ఉత్తర తెలంగాణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. వీటితో పాటు నగరంలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు కూడా మోక్షం లభించనుంది. మొదటి దశలో రూ. 500 కోట్లతో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ భారీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి.

# కేసీఆర్ హయంలోనే మిగులు విద్యుత్

**హైదరాబాద్ :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మునిగిపోతుందని ఆనాడు కొందరు అసత్యాలు ప్రచారం చేశారని... ఆ మాటలను తెలంగాణ పటాపంచలు చేసిందని అన్నారు. ఆనాడు అసత్యాలు ప్రచారం చేసిన వారే ఇప్పుడు చీకట్లో మిగిలిపోయారని, తెలంగాణ మాత్రం వెలుగుల్లో మెరిసిపోతోందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారిందని కేటీఆర్ అన్నాను. దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని పవర్ ప్రాజెక్టుల్లో ఒకటైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నాలుగో యూనిట్ లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందని చెప్పారు. ఇది తెలంగాణ విద్యుత్ రంగంలో పెద్ద మైలురాయి అని అన్నారు. కేసీఆర్ స్వప్నాన్ని సాకారం చేసిన విద్యుత్ శాఖ ఇంజినీర్లు, సిబ్బంది, భాగస్వాములందరికీ అభినందనలు తెలిపారు.

### మేమే సెకండ్

తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం



చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు.గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నేత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కూడా పాల్గొన్నారు.

## ట్రూ ఆప్ బాదుడు...

**హైదరాబాద్ :** రాబోయే సంవత్సరానికి (2026 27) సంబంధించి ఎలాంటి ఛార్జీల భారాన్ని మోపని డిస్కంలు పాతకాలం నాటి ట్రూ అప్ ఛార్జీల భారాన్ని వినియోగదారులపై మోపేందుకు రంగం సిద్ధంచేశాయి. 2022-23, 2023- 2024 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ట్రూ అప్ ఛార్జీలకు సంబంధించి ఉత్తర మండల విద్యుత్తు పంపి ణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్), దక్షిణ మండల విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీఎల్)లు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) ముందు ఇందుకు సంబంధించిన పిటిషన్లన సమర్పించాయి. ఈ మూడేళ్లకు సంబంధించి మొత్తం రూ.8,532 కోట్లను వినియోగదారులపై భారం పడనుంది. విద్యుత్ కొనుగోలు అంచనాలకు, కొనుగోలు చేసినదానికి మధ్య తేడానే ట్రూఅప్ ఛార్జీలుగా చెప్పవచ్చు. 2022 ఎస్పీడీసీ ఎల్ రూ.4,104కోట్లు, ఎన్‌పీడీసీఎల్ రూ. 2,779 కోట్లను ట్రూఅప్ ఛార్జీలుగా ప్రతిపాదించాయి.అలాగే 2023 ఆర్థిక సంవ త్సరంలో ఈ రెండు డిస్కంలు కలిసి రూ. 2,448 కోట్లుగా ట్రూఅప్ ఛార్జీలను ప్రతిపాదించాయి. అంటే ఈ రెండు సంవత్సరాల్లో ట్రూఅప్ చార్జీలుగా రూ.9,331 కోట్లకు డిస్కంలు ప్రతిపాదించాయి. అయితే 2024 కొనుగోలు అంచనాలకంటే కొనుగోలు చేసిన విద్యుత్తు ఖర్చు తక్కువగా ఉండటంతో రెండు డిస్కంల పరిధిలో రూ.799 కోట్లు తక్కువగా తేలింది. మొత్తం మూడు ఆర్థిక సంవత్సరాలకు కలిపి రూ.8,532 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు అనుమతించాలని ప్రతిపాదిస్తూ డిస్కంలు చేసుకున్న విజ్ఞప్తిపై ఈఆర్సీ బహిరంగ విచారణ చేయనుంది. దీనిపై ఏమైనా అభ్యంత రాలుంటే ప్రజలు, సంస్థలు, ఎన్జీవోలు, నిపుణులు ఈనెల 31లోగా తెలపవ చ్చు. ఈ రెండు డిస్కంల పిటిషన్లపై ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లోని ఈఆర్సీ భవన్‌లో బహిరంగ విచారణ జరుపుతుంది.

## ఫ్యూచర్ సిటీ కోసం వెబ్ సైట్



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న హైదరాబాద్ ఫోర్త్ సిటీ పనులు వేగవంతమయ్యాయి. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రజలకు, పెట్టుబడిదారులకు అందించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అధికారులు రూపొందిస్తున్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, వినోద కేంద్రాలతో కూడిన ఈ భావి నగరం భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చెందుతోంది.తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న హైదరాబాద్ ఫోర్త్ సిటీ (భారత్ ఫ్యూచర్ సిటీ) ప్రాజెక్టు పనులు శరవేగంగా పుంజుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టును ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలోనే ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రజలకు, పెట్టుబడిదారులకు చేరువ చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను అధికారులు రూపొందిస్తున్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఐటీ శాఖలోని ఒక ప్రత్యేక విభాగం 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ' పేరుతో అత్యాధునిక వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పోర్టల్‌ల తరహాలోనే ఇది ఉండనుంది. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో ఉన్న వెబ్‌సైట్‌లో ప్రాథమిక సమాచారం ఉండగా.. కొత్త పోర్టల్‌లో పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కోసం పూర్తిస్థాయి డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఇళ్ల నిర్మాణాలు, ప్లాట్ల క్రయవిక్రయాలు, అనుమతుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ గ్రామాల పరిధిలో ఈ భావి నగరం రూపుదిద్దుకుంటోంది. తొలి దశలో 32 గ్రామాల పరిధిలో 432 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దీనిని ప్రారంభించాలని అనుకున్నప్పటికీ.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా దీనిని 56 గ్రామాలు 765 చదరపు కిలోమీటర్ల భారీ విస్తీర్ణానికి పెంచారు. ఇక్కడ కేవలం ఐటీ, ఫార్మా సంస్థలే కాకుండా గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు కొలువుదీరనున్నాయి. ఇటీవల నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047' విజయవంతం కావడంతో పెట్టుబడిదారుల నుంచి భారీగా ఆసక్తి వ్యక్తమవుతోంది.ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో భూ సరిహద్దుల నిర్ణయం కోసం ప్రత్యేకంగా 20 మంది సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. వీరు ప్రైవేటు, పట్టా, ప్రభుత్వ భూములను గుర్తించి సరిహద్దులు నిర్ణయిస్తారు. మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ శాశ్వత కార్యాలయాన్ని ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టుపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు వెబ్‌సైట్‌లో 'ప్రశ్నలు-సమాధానాలు' విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు.

## ప్రాణాంతకంగా మారిన చైనా మాంజా

**హైదరాబాద్ :** చైనా మాంజా మరోసారి ప్రాణాంతకంగా మారుతోంది. నిషేధిత చైనా మాంజా కారణంగా రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతుండటంతో పాటు మూగజీవాలు, పక్షులు భారీగా బలవుతున్నాయి. ఇటీవల పాతబస్తీ ప్రాంతాల్లో చైనా మాంజాకు చిక్కి పదుల సంఖ్యలో పావురాలు



మృత్యువాత పడటం కలచివేసే అంశంగా మారింది. గాలిలో కనిపించని విధంగా ఉండే ఈ పదునైన మాంజా పక్షుల రెక్కలు, మెడలను కోసేస్తుండటంతో అవి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదే మాంజా వాహనదారులకు కూడా ముప్పుగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు, ముఖ్యంగా మెడ భాగంలో చైనా మాంజా తగిలి తీవ్ర గాయాలపాలవుతున్న ఘటనలు గతంలోనూ నమోదయ్యాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ చార్మినార్ జోన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. డీసీపీ కారే కిరణ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో వాహనదారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా సేఫ్టీ రాడ్లను పంపిణీ చేస్తూ, చైనా మాంజా వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మెడను రక్షించే విధంగా అమర్చుకునే ఈ సేఫ్టీ రాడ్లు ప్రమాదాల తీవ్రతను తగ్గించడంలో ఎంతో ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. పాతబస్తీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాహనదారులు వీటిని తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు.అదేవిధంగా ఫలక్‌నుమా పోలీసులు చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గాలిపటాల పండుగ సమయంలో పిల్లలు చైనా మాంజా వినియోగించకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు గాలి పటాలను పంపిణీ చేస్తూ, చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. చైనా మాంజా వాడటం చట్టరీత్యా నేరమని, దీని వల్ల మనుషులకే కాకుండా పక్షులు, జంతువులు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని పోలీసులు స్పష్టం చేశారు. సురక్షితమైన నూలు, పర్యావరణానికి హానికరం కాని మాంజానే ఉపయోగించాలని సూచించారు. చైనా మాంజా వాడకం పూర్తిగా ఆపివేయాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని పోలీసులు తెలిపారు. నిషేధిత మాంజాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగల ఆనందం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పోలీసులు కోరుతున్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలను తగ్గించడంలో కీలకంగా మారతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బిజినెస్

# భారత్ నిర్మాణంలో పదేండ్ల ప్రస్థానం

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఓ మైలురాయిగా నిలిచిన ఫోన్‌పే ఆవిష్కరణకు దశాబ్దం పూర్తయింది, ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్‌లో అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫోన్‌పే ఇటీవల దశాబ్ది వేడుకలను నిర్వహించింది. దశాబ్దం పాటు పురోగతిని ముందుకు తీసుకెళ్లడానికి, లక్షలాది మందికి ఆర్థిక సేవలను చేరువ చేయడానికి, భారతదేశంలో డబ్బుతో లావాదేవీలు చేసే, డబ్బును నిర్వహించే విధానంలో మార్పును తీసుకురావడానికి సూచికగా ఈ మైలురాయి నిలుస్తుంది. 2025లో, ఫోన్‌పేలో రిజిస్టర్ అయిన యూజర్ల సంఖ్య 60 కోట్లు దాటడంతో ఫోన్‌పే ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది, ఇది భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా నిలవడంలో ఫోన్‌పే పాత్రను మరింత పటిష్టం చేసింది. ఈ సంవత్సరం, విశ్వసనీయమైన కాంటాక్ట్‌లకు డెలిగేటెడ్ పేమెంట్లు (పేమెంట్ చేసే అనుమతిని సెకండరీ యూజర్‌కు ప్రైమరీ యూజర్ ఇవ్వడం) చేసే అవకాశాన్ని కల్పించే జఖఎ సర్కిల్‌తో పాటు, మోసపూరిత లావాదేవీల నుండి లక్షలాది మందికి భద్రత కల్పించడానికి రూపొందించిన సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ అయిన ఫోన్‌పే ప్రొటెక్ట్ వంటి ఫీచర్లను తీసుకురావడం ద్వారా యూజర్ నమ్మకాన్ని పెంచడం, యాక్సెస్ చేయగలిగే సర్వీస్‌లను విస్తరించడంపై దృష్టి సారించింది. మర్చంట్ ఎకోసిస్టమ్‌ను మరింత శక్తిమంతం చేయడం కోసం, మేడ్-ఇన్-ఇండియా స్మార్ట్‌స్పీకర్, స్మార్ట్‌పాడ్‌లను ఫోన్‌పే ప్రవేశపెట్టింది, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో దేశవ్యాప్తంగా ఉన్న బిజినెస్‌ల చేరికను ప్రోత్సహించింది. ూఎఆఃఎతో ఫోన్‌పే కుదుర్చుకున్న భాగస్వామ్యంలో భాగంగా తీసుకొచ్చిన ఉద్యమ్ అసిస్ట్ అనే కార్యక్రమంతో, వారి అధికారిక క్రెడిట్ యాక్సెస్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఓూఇలకు డిజిటల్-ఫస్ట్ ఇంటిగ్రేషన్‌ను మొదటగా అందించిన సంస్థలలో ఒక కంపెనీగా నిలిచింది. వీటికి తోడు, భారతదేశంలో ఆర్థిక భద్రత లేని ప్రజల (మిస్సింగ్ మిడిల్) కోసం హోమ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి అందరికీ కావాల్సిన సంరక్షణను, సరసమైన ధరకే అందుబాటులోకి తీసుకొచ్చి, వినియోగదారులకు అందించే ప్రోడక్ట్‌లను ఫోన్‌పే విస్తరించింది, అదే సమయంలో మ్యూచువల్ ఫండ్‌లపై లోన్ వంటి వినూత్న




లెండింగ్ సొల్యూషన్ల ద్వారా లిక్విడిటీని అన్‌లాక్ చేసింది, కీలకమైన ఆర్థిక సర్వీస్‌లు కోట్లాది మందికి అందుబాటులో ఉండేలా చూసుకుంటోంది. ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ నిగమ్ ఈ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ, "మా పదేళ్ల ప్రయాణంలో అత్యంత ఉత్తేజకరమైన విషయం ఏమిటంటే, మేము ఇంత దూరం వచ్చినా కూడా, శిఖరాగ్రం ఇంకా మాకు కనిపించడం లేదు. అది ఎంత ఎత్తులో ఉందో, ఎంత విస్తరించి ఉందో కూడా మాకు తెలియదు, కాకపోతే అలా తెలియకపోవడం వల్లనే ఈ ప్రయాణం ఉత్సాహభరితంగా మారుతోంది. తమ రంగంలో అత్యుత్తమంగా రాణించడానికి ప్రతిరోజూ కృషి చేస్తున్న వేలాది మంది ఉత్సాహవంతులైన, పట్టుదల కలిగిన వ్యక్తులతో సాగిస్తున్న ఈ ప్రయాణం ఎప్పటిలాగే అర్థవంతంగా, ఉత్తేజకరంగా కొనసాగుతుంది" అని అన్నారు. ఫోన్‌పే వ్యవస్థాపకుడు, ఊ రాహుల్ చారి మాట్లాడుతూ, "ఫోన్‌పేలో మేము సాగించిన నిర్మాణం గురించి చాలా గర్వంగా ఉంది. పరిశ్రమతో పాటు, విస్తారమైన ఎకోసిస్టమ్ నుండి లభించిన ఆదరవు, మద్దతు మాలో అణకువను నింపాయి. ఈ ప్రయాణం నుండి నేర్చుకోవాల్సిన శాశ్వతమైన పాఠం ఏదైనా ఉందంటే, అది ప్రజలు వాస్తవంగా నమ్మే దాన్ని నిర్మించడమే, ఎందుకంటే తీవ్రమైన ఉత్సాహం మాత్రమే ఒక ఆలోచనను ప్రభావం చూపే శక్తిగా మలచగలదు" అని అన్నారు. ఫోన్‌పే ఈ రంగంలోకి అడుగు పెట్టినప్పటి నుండి, ఆర్థిక సేవలను ప్రజాస్వామ్యీకరించే లక్ష్యంతో, పరిశ్రమలో మొట్టమొదటిసారిగా వచ్చిన వరుస ఆవిష్కరణలను తీసుకొచ్చి, భారతీయ ఫిన్‌టెక్ ల్యాండ్‌స్కేప్‌ను స్థిరంగా పునర్నిర్వచించింది. డిజిటల్ గోల్డ్, మ్యూచువల్ ఫండ్‌ల నుండి మొదలుకుని, ఇన్సూరెన్స్, స్టాక్ బ్రోకింగ్‌ను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడం వరకు, పలు మార్పులకు లోనవుతూ, పేమెంట్స్ యాప్ నుండి ఆర్థిక సేవలన్నీ సమగ్రంగా అందించే ఎకోసిస్టమ్‌గా (కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌గా) రూపాంతరం చెందింది. మర్చంట్లకు అందుతున్న పేమెంట్లపై వారికి స్పష్టతను ఇవ్వడానికి, అలానే నియంత్రణను కల్పించడానికి ఫోన్‌పే బిజినెస్ యాప్, చిన్న వ్యాపారాలను శక్తిమంతం చేయడానికి మర్చంట్ లెండింగ్, క్రెడిట్‌ను సజావుగా యాక్సెస్ చేయడానికి జఖఎలో క్రెడిట్ లైన్, తగాదాలు, విభేదాలు లేని లావాదేవీల కోసం ప్రవేశపెట్టిన క్రాస్-బోర్డర్ జఖఎ, జఖఎ లైట్, అలానే 2024లో ప్రారంభించిన ఇండస్ యాప్‌స్టోర్, షేర్.మార్కెట్, సెక్యూర్డ్ లెండింగ్ ప్లాట్‌ఫామ్‌లు వంటి ముఖ్యమైన మైలురాళ్లు ఈ మొత్తం ప్రయాణంలో ఉన్నాయి. 2022లో కార్యకలాపాల నిర్వహణను పూర్తిగా భారతదేశానికి మార్చేయడం, అలానే క్రెడిట్, సంపద నిర్వహణలోకి నిరంతరం విస్తరించడం ద్వారా, ఫోన్‌పే ఒక సాధారణ యుటిలిటీ అనే అభిప్రాయాన్ని దాటుకుంటూ, భారతదేశ ఆర్థిక నిర్మాణంలో అంతర్భాగంగా మారే స్థాయికి ఎదిగింది, సంరక్షణ, ఇన్వెస్ట్‌మెంట్, క్రెడిట్ సౌకర్యాలు అనేవి దేశంలోని ప్రతి పౌరునికీ అందుబాటులో ఉండాల్సిన హక్కులు అని భావిస్తూ, అవి అందరికీ అందేలా చూసుకుంటోంది.

## త్వరలో పబ్లిక్ ఇష్యూకు టెక్నో పెయింట్స్!

**రూ.500 కోట్ల సమీకరణ లక్ష్యం**

**ప్రచారకర్తగా సచిన్ నియామకం**

**ఆ కంపెనీ చైర్మెన్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**




పెయింట్స్ తయారీలో ఉన్న టెక్నో పెయింట్స్ అండ్ కెమి కల్స్ భారీ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా పబ్లిక్ ఇష్యూకు రావాలని యోచిస్తోంది. అదే విధంగా కంపెనీ గ్లోబల్ గుర్తింపున కోసం ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సచిన్ తమ సంస్థకు మూడేండ్లు పాటు ప్రచారకర్తగా కొనసాగనున్నారని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో రూ.500 కోట్ల నిధుల సమీకరణ కోసం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌కు రానున్నామన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే ప్రతిపాదిత పత్రాలను సెబీకి సమర్పించనున్నామని చెప్పారు. గడిచిన 2024-25లో తమ సంస్థ రూ.210 కోట్ల రెవెన్యూ సాధించిందన్నారు. ప్రస్తుత 2025-26లో రూ.450 కోట్ల టర్నోవర్ అంచనా వేస్తోన్నామన్నారు. 2029-30 నాటికి రూ.2,000 కోట్ల రెవెన్యూను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఒడిషా, చండీగఢ్‌లో కార్యకలాపాలను కలిగి ఉన్నామని చెప్పారు. ఈ ఏడాది ముగింపు నాటికి హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌కు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2026-27లో మధ్యప్రాచ్య దేశాల్లో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం 175 పెయింటింగ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణలో 26,065 పాఠశాలలకు పెయింటింగ్ పనులు ప్రారంభం అయ్యాయని చెప్పారు. 5వేల మందికిపైగా నిపుణులైన పెయింటర్లకు తమ సంస్థ ఉపాధిని కల్పిస్తోందన్నారు.

## భారత్‌లో క్రిప్టో నిబంధనలు మరింత కఠినం



**ఢిల్లీ:** డిజిటల్ ఆస్తుల మార్కెట్‌లో చట్ట విరుద్ధ కార్యకలాపాలను తొలగించే ప్రయత్నంలో భాగంగా, భారతదేశ ఆర్థిక నిఘా విభాగం (ఎఫ్ఐయూ) క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీల కోసం కఠినమైన కొత్త యాంటీ-మనీ లాండరింగ్ (ఏఎంఎల్), నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రోటోకాల్‌లను ఆవిష్కరించింది. వీటిలో ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సమయంలో తప్పనిసరి లైవ్‌నెస్ డిటెక్షన్ (లైవ్ సెల్ఫీలు), భౌగోళిక ట్రాకింగ్ (జియో ట్యాగింగ్) వంటివి ఉన్నాయి. ఈ నెల 8న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, క్రిప్టో ఎక్స్ఛేంజీలను వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సర్వీస్ ప్రొవైడర్లుగా వర్గీకరించారు. ఇప్పుడు వీడీఏలు సాధారణ డాక్యుమెంట్ అప్‌లోడ్‌లను అనుమతించడంతో పాటు మరిన్ని పనులు చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం, వినియోగదారులు తమ ఉనికిని ధ్రువీకరించే 'లైవ్ సెల్ఫీ' తీసుకోవాలి. సాధారణంగా కళ్లు రెప్ప వేయడం లేదా తల కదలిక ద్వారా ఈ చర్య స్టాటిక్ ఫొటోలు లేదా డీప్‌ఫేక్‌ల వాడకాన్ని నిరోధించడంలో సాయపడుతుంది. వినియోగదారు ఖాతాను సృష్టించడం ప్రారంభించిన కచ్చితమైన అక్షాంశం, రేఖాంశం, తేదీ, సమయ ముద్ర; ఐపీ చిరునామాను ఎక్స్ఛేంజీలు నమోదు చేయాల్సి ఉంటుంది. 'పెన్నీ-డ్రాప్' పద్ధతి అవసరం. దీనిలో బ్యాంక్ ఖాతా యాక్టివ్‌గా ఉందని, రిజిస్ట్రంట్‌కు చెందినదని నిర్ధారించడానికి నామమాత్రపు రూపాయి లావాదేవీని ప్రాసెస్ చేస్తారు. పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య)తో పాటు వినియోగదారులు పాస్‌పోర్ట్, ఆధార్ లేదా ఓటరు ఐడీ వంటి సెకండరీ ఐడీని, ఇ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు కోసం ఓటీపీ ధ్రువీకరణను అందించాలి.

# ఔషధ కంపెనీలకు ఊరట

**చిన్న ఉల్లంఘనలకు కోర్టులకు హాజరు కానక్కర్లేదు!**

**డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టానికి సవరణలు**

దిల్లీ: 'కొన్ని చిన్న ఉల్లంఘనల' విషయంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఇకపై కోర్టులకు హాజరు కానవసరం లేదని తాజాగా సవరించిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికి బదులు వారు షరతులకు లోబడి నగదు జరిమానా చెల్లించవచ్చు. అలాగే స్వీయ దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టంతో పాటు వివిధ చట్టాల్లోని చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న జన్ విశ్వాస్ చట్టం కింద ప్రవేశపెట్టిన డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్) 2025 ద్వారా మార్గదర్శకాల్లో మార్పులు తెచ్చారు. ఈ చట్టం దేశంలో మందులు, కాస్మటిక్స్, వైద్య పరికరాల భద్రత, సామర్థ్యం, నాణ్యతను నిర్ధారిస్తుంది. ఈ చట్టాన్ని సక్రమంగా పాటించకపోతే విచారణకు దారి తీయవచ్చు. అయితే న్యాయ వ్యవస్థపై ఎక్కువ భారం పడకుండా చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి, నేరాలను సమ్మిళితం చేయడానికి సెక్షన్ 32బి ప్రవేశపెట్టారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) 'నేరాల సమ్మేళనం' అనే కొత్త ప్రక్రియను వివరిస్తూ, డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (నేరాల సమ్మేళనం) నిబంధనలు 2025ను రూపొందించింది. అయితే వీటిల్లో జరిమానా మొత్తం ఎంతనేది పేర్కొనలేదు. అలాగే నేరాలను కూడా వెల్లడించలేదు.



## స్పోర్ట్స్

### ఫ్రాంచైజీ క్రికెట్‌లో 19 ఏళ్ల కుమారుడితో..

# చరిత్ర సృష్టించిన ఆల్‌రౌండర్!

క్రికెట్ దిగ్గజాల వారసులు జూనియర్ స్థాయిలో రాణించడం చూశాం. అయితే.. తండ్రీకొడుకులు ఒకే జెర్సీతో మైదానంలోకి దిగడం మాత్రం చాలా అరుదైన విషయం. ఈ అపురూపమైన ఘట్టానికి బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ వేదికైంది. సోమవారం నొకాలీ ఎక్స్‌ప్రెస్ జట్టు తరుపున అఫ్గనిస్థాన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ అతడి కుమారుడు హసన్ ఇసాఖిల్ కలిసి ఆడారు. తద్వారా ఫ్రాంచైజీ క్రికెట్‌లో కలిసి ఆడిన తండ్రీకొడుకులుగా నబీ, ఇసాఖిల్ చరిత్ర సృష్టించారు. మ్యాచ్‌కు ముందు నబీ చేతుల మీదుగా డెబ్యూట్ క్యాప్ అందుకున్నాడు. తండ్రి వారసత్వాన్ని కొనసాగించిన హసన్ విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. నబీ మాదిరిగానే అతడు బ్యాట్‌ను కాస్త వంచి పట్టుకొని.. ఫ్లిక్, సొగసైన ఫుల్ షాట్లతో అలరించాడు. ఢాకా క్యాపిటల్స్ బౌలర్లను భయపెడుతూ 60 బంతుల్లో ఏడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 93 రన్స్ కొట్టాడు. మొదట సౌమ్యా సర్కార్‌తో కలిసి హసన్ 101 రన్స్ జోడించాడు. అనంతరం 14వ ఓవర్‌లో నబీ క్రీజులోకి వెళ్లాడు. తండ్రి కొడుకులు దూకుడుగా ఆడి నాలుగో వికెట్‌కు 53 పరుగులు రాబట్టారు. కుమారుడితో కలిసి ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆడడాన్ని నబీ ఎంతగానో ఆస్వాదించాడు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో అతడు పుత్రోత్సాహంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.



## వన్డేల్లో 'నయా ఆల్‌రౌండర్'..

## మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతున్న గంభీర్ శిష్యుడు..!



వన్డే ఫార్మాట్‌లో భారత జట్టుకు ఆల్‌రౌండర్ కొరత తీరేలా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో పేసర్ హర్షిత్ రానా (ఝతీంష్త్రఱ్‌ ఝఖఱ )సంచలన ఆటతో నేను రెఢీ అని చాటుకుంటున్నాడు. తనపై 'గంభీర్ శిష్యుడు' అనే ముద్ర వేసిన విమర్శకులకు మైదానంలో జట్టును గెలిపించే ప్రదర్శనతోనే బదులిస్తున్నాడీ స్పీడ్‌స్టర్. మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతున్న ఈ పొడగరి పేసర్.. వడోదర వన్డేలో ఖతర్నాక్ ఇన్నింగ్స్‌తో టీమిండియా విజయంలో కీలకమయ్యాడు. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ 'నన్ను వన్డేల్లో ఆల్‌రౌండర్‌గా చూడాలనుకుంటోంది' అని వెల్లడించాడు. టీమిండియా కోచ్‌గా గౌతం గంభీర్ రావడమే ఆలస్యం కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు సభ్యులకు పెద్ద పీట వేశాడు. పేసర్ హర్షిత్ రానా, వరుణ్ చక్రవర్తిలు భారత జెర్సీ వేసుకున్నారు. వరుణ్ టీ20లకే పరిమితమవ్వగా.. హర్షిత్ మాత్రం పొట్టి ఫార్మాట్‌తో పాటు టెస్టులు, వన్డేల్లోనూ పాతుకుపోతున్నాడు. 'మేనేజ్‌మెంట్ ఎందుకు రానాకు ఇన్ని అవకాశాలు ఇస్తోంది?' అనే ప్రశ్నకు తన ఆటతోనే సమాధానం చెబుతున్నాడీ పేసర్.

న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు ఫామ్‌లో ఉన్న అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్‌ను తుది జట్టులోకి తీసుకోవడంపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. దాంతో.. న్యూజిలాండ్ ఓపెనర్లను ఔట్ చేసి బ్రేకిచ్చిన ఈ పేస్ గన్.. కాస్త అగ్రెస్సివ్‌గానే సెలబ్రేట్ చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ తనను టీమ్ మేనేజ్‌మెంట్ వన్డేల్లో ఆల్‌రౌండర్‌గా చూడాలనుకుంటోంది అని చెప్పాడు. 'భారత మేనేజ్‌మెంట్ నన్ను వన్డేల్లో ఆల్‌రౌండర్‌గా ఉపయోగించుకోవాలని అనుకుంటోంది. నేను కూడా మెరుగయ్యేందుకు కష్టపడుతున్నా. నెట్స్‌లో కూడా బ్యాటింగ్ మీద ఎక్కువే దృష్టి పెడుతున్నా. ఆల్‌రౌండర్‌గా రాణించాలంటే అన్నికంటే ముఖ్యమైంది ఆత్మవిశ్వాసంగా ఉండడం. సహచరులు నాలో కల్పించిన ఆత్మవిశ్వాసం నాకు ఎంతో ఉపయోగపడింది. జట్టులో నా పాత్ర ఏంటో నాకు తెలుసు. అందుకే క్రీజులోకి వెళ్లడమే ఆలస్యం పరుగులు చేసేందుకు ప్రయత్నిస్తాను. బ్యాటింగ్ విషయానికొస్తే నన్ను ఎనిమిదో స్థానంలో ఆల్‌రౌండర్‌గా పంపిస్తున్నారు' అని రానా వెల్లడించాడు. వడోదర వన్డేలో కివీస్ నిర్దేశించిన 301 పరుగుల ఛేదనలో విరాట్ కోహ్లీ(93), శ్రేయాస్ అయ్యర్(49) మెరుపులతో పటిష్ట స్థితిలో ఉన్న టీమిండియా ఒక్కసారిగా కష్టాల్లో పడింది. జేమీసన్ ఓవర్లో విరాట్ ఔటయ్యాక వెంట వెంటనే మూడు వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన హర్షిత్.. విధ్వంసక ఆటతో పరుగుల అంతరాన్ని తగ్గించాడు.

## బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు మార్చండి!..

## స్పందించిన బీసీసీఐ




టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ ఆడే వేదికల మార్పు అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పందించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని స్పష్టం చేసింది. కాగా బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడుల నేపథ్యంలో భారత్‌తో దౌత్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే.

**భద్రత విషయంలో..**

ఈ క్రమంలో ఐపీఎల్ నుంచి బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రహమాన్ (వీబర్ఝటఱఓబతీ ఝష్త్రమ్ఖఅ)ను బీసీసీఐ తొలగించిది. ఈ నేపథ్యంలో తమ ఆటగాళ్ల భద్రత దృష్ట్యా భారత్‌లో తాము టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడబోమంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) పంతానికి పోయింది. తమ జట్టు ఆడే వేదికలను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాల్సిందిగా ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. అయితే, టోర్నీ ఆరంభానికి కొద్ది రోజుల (ఫిబ్రవరి 7) సమయమే ఉన్నందున ఐసీసీ ఇందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ వేదికలను కోల్‌కతా, ముంబై నుంచి చెన్నై, తిరువనంతపురానికి మార్చినట్లు సోమవారం వార్తలు వచ్చాయి.

**స్పందించిన బీసీసీఐ**

ఈ విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్వయంగా స్పందించారు. ×ూచీతో మాట్లాడుతూ.. "బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలను చెన్నై లేదంటే మరో చోటికి మార్చాలంటూ ఐసీసీ నుంచి బీసీసీఐకి ఎలాంటి సందేశమూ రాలేదు. అయినా ఈ విషయం మా ఆధీనంలో లేదు. బీసీబీ, ఐసీసీ మధ్య వ్యవహారం ఇది. ఐసీసీ పాలక మండలికే అన్ని అధికారాలు ఉంటాయి. ఒకవేళ వేదికలను మార్చాలని గనుక ఐసీసీ ఆదేశిస్తే.. ఆతిథ్య దేశంగా అందుకు తగ్గట్లుగా చర్యలు చేపడతాము. ఇప్పటికైతే ఈ అంశంలో మాకు ఎలాంటి సమాచారమూ లేదు" అని దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

**టీ20 ప్రపంచకప్-2026లో బంగ్లాదేశ్ షెడ్యూల్**

ఫిబ్రవరి 7- వెస్టిండీస్‌తో- కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా

ఫిబ్రవరి 9- ఇటలీతో- కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా

ఫిబ్రవరి 14- ఇంగ్లండ్‌తో- కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా

ధర్మఘంట

# పూతరేకులు తేస్తే.. హైదరాబాద్ తీసుకెళ్లిపోతా: హీరోయిన్ కామెంట్స్ వైరల్



శర్వానంద్ హీరోగా వస్తోన్న సంక్రాంతి సినిమా నారీ నారీ నడుమ మురారి. ఈ చిత్రంలో సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. ఇప్పటికే ట్రైలర్ రిలీజవ్వగా ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న రిలీజ్ కానుంది. లిఈ నేపథ్యంలో నారీ నారీ నడుమ మురారి మేకర్స్ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఏపీలో ఆత్రేయపురంలో జరిగిన ఈ వేడుకలో హీరోయిన్స్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త తన కోరికను ఆడియన్స్‌తో పంచుకుంది. తనకు ఇక్కడ ఫేమస్ అయిన పూతరేకులు కావాలని అడిగింది. ఎవరైనా ఇంట్లో తయారు చేసిన పూత రేకులు తెచ్చిఇవ్వాలని ఫ్యాన్స్‌ను కోరింది. డ్రై ఫ్రూట్స్‌తో చేసిన పూతరేకులు తీసుకువస్తే.. హైదరాబాద్‌కు పట్టుకెళ్లిపోతానంటూ కామెంట్స్ చేసింది. హీరోయిన్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## ఎంఆర్‌పీ ధరలకే టికెట్లు.. నారీ నారీ నడుమ మురారి టీం సంక్రాంతి ఆఫర్

టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ (రాష్ట్రుతీఝుఖుఅం) నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ నారీ నారీ నడుమ మురారి (చీుతీఱ చీుతీఱ చీుంబఝ వీబతీుతీఱ). రాష్ట్రుతీఝు 37గా వస్తోన్న ఈ చిత్రానికి సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నాడు. భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్, ఏజెంట్ ఫేం సాక్షి వైద్య ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని పలు చిత్రాలు టికెట్ రేట్లను పెంచుకుని బరిలో దిగుతున్నాయని తెలిసిందే. అయితే రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో నారీ నారీ నడుమ మురారి టీం మాత్రం మూవీ లవర్స్‌కు శుభవార్తను షేర్ చేసింది. సాధారణ టికెట్ ధరలకే ఈ మూవీని విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. శర్వానంద్ టీం తీసుకున్నఈ నిర్ణయం ఖచ్చితంగా సంక్రాంతికి నిర్మాతలకు బాగా కలిసొచ్చే విషయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సంక్రాంతికి అసలైన పండుగ ఆఫర్.. ఎంఆర్‌పీ ధరలకే టికెట్లు.. అదనపు ఛార్జీలు ఏం లేవు.. అంటూ శర్వానంద్ కోడిపుంజును చేపబట్టుకున్న లుక్‌ను షేర్ చేశారు. ఇప్పుడీ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తుండగా.. మేకర్స్ ఇప్పుడు ట్రైలర్‌ను కూడా షేర్ చేశారు. ఆటోడ్రైవరైన కమెడియన్ సత్య ఓ మహిళను ఆస్పత్రికి తీసుకొచ్చి జాగ్రత్త దింపేసి వెళ్లే క్రమంలో.. ఆ మహిళ డబ్బులు తీసుకో బాబు అని అంటే.. అయ్యో వద్దమ్మా గర్భిణీ స్త్రీల దగ్గర డబ్బులు తీసుకోనమ్మా సత్య అంటాడు. నేను ప్రెగ్నెంట్ కాదు అని ఆ మహిళ అనే ఫన్నీ సన్నివేశంతో షురూ అయింది ట్రైలర్. ఆ తర్వాత బీటెక్ చదివి ఆర్కిటెక్ట్‌గా పనిచేసే క్రమంలో శర్వానంద్‌కు సంయుక్తా మీనన్, సాక్షి వైద్య కలుస్తారు. ఇద్దరి మధ్య ఎలా నలిగిపోతాడనే నేపథ్యంలో సినిమా సాగనున్నట్టు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఒక హీరో రెండు ప్రేమకథలు.. ముగింపే లేని సమస్య అంటూ రిలీజ్ చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది.

## భారీ అంచనాల మధ్య వచ్చిన 'పరాశక్తి' .. డిజాస్టర్‌తో శ్రీలీల ఆశలు గల్లంతు



సంక్రాంతి పండుగను లక్ష్యంగా చేసుకుని కోలీవుడ్‌లో భారీ హైప్‌తో విడుదలైన పరాశక్తి తొలి షోల నుంచే మిశ్రమ స్పందనను అందుకుంటోంది. శివకార్తికేయన్ కథానాయకుడిగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా రవి మోహన్ విలన్ పాత్ర, అథర్వ కీలక పాత్రతో పాటు, శ్రీలీల కోలీవుడ్‌లో అడుగుపెట్టిన తొలి సినిమా కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల్లో కథ ఉద్దేశం బాగున్నప్పటికీ, కథనం మరింత బలంగా ఉండాల్సిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. స్క్రీన్‌ప్లేలో సరైన ఉత్కంఠ లేకపోవడం, కొన్ని సన్నివేశాలు అనవసరంగా లాగినట్లు అనిపించడం వల్ల సినిమా ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిందని టాక్. దీంతో వాయిదా పడిన ఇతర భారీ చిత్రాల వల్ల ఏర్పడిన ఖాళీని పరాశక్తి పూర్తిగా భర్తీ చేయలేకపోయిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాతో తమిళ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనుకున్న శ్రీలీలకు ఫలితం మాత్రం అంత అనుకూలంగా కనిపించడం లేదు. ఇప్పటికే తెలుగులో వరుస సినిమాలు చేసినప్పటికీ, ఇటీవల ఆమె నటించిన చిత్రాలు ఆశించిన విజయాలు సాధించలేకపోయాయి. అందంతో పాటు డాన్స్, ఎనర్జీ ఉన్నప్పటికీ, సరైన బ్రేక్ కోసం ఆమె ఇంకా ఎదురుచూస్తూనే ఉందన్న అభిప్రాయం బలపడుతోంది. సుధా కొంగర సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు సాధారణంగా బలంగా ఉంటాయన్న పేరు ఉంది. అలాంటి దర్శకురాలి సినిమాలో అవకాశం రావడంతో శ్రీలీల పాత్ర కెరీర్ మలుపు అవుతుందని భావించారు. లుక్‌లో మార్పులు, నటనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినా, 'రత్నమాల' పాత్ర ప్రేక్షకులపై పెద్దగా ముద్ర వేయలేకపోయిందని విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, సినిమాకు సంబంధించిన కొన్ని డైలాగులు వివాదాలకు దారితీశాయి. ముఖ్యంగా తమిళ వెర్షన్‌లో ఉపయోగించిన కొన్ని పదాలపై తెలుగు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సోషల్ మీడియాలో చర్చలు ఊపందుకున్నాయి. సెన్సార్ చేసినప్పటికీ ఆ అంశంపై నెగిటివ్ ప్రచారం సినిమాపై ప్రభావం చూపిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే, కోలీవుడ్‌లో కొత్త ఆశలతో అడుగుపెట్టిన శ్రీలీలకు పరాశక్తి పెద్ద బ్రేక్‌ను ఇవ్వలేకపోయిందనే భావన బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె తెలుగులో పవన్ కళ్యాణ్ సరసన నటిస్తున్న ఉస్తాద్ భగత్‌సింగ్పై ఆశలు పెట్టుకుంది. ఆ సినిమా విజయం సాధిస్తే, మళ్లీ ఆమె కెరీర్‌కు కొత్త ఊపిరి దక్కే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## గోల్డెన్ గ్లోబ్స్ 2026లో 'అడాల్‌సెన్స్' సిరీస్ దూకుడు.. యువ నటుడి అరుదైన ఘనత



అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్న అడాల్‌సెన్స్ సిరీస్ మరోసారి ప్రపంచవ్యాప్తంగా చర్చకు వచ్చింది. తాజాగా ప్రకటించిన గోల్డెన్ గ్లోబ్స్ 2026 అవార్డుల్లో ఈ సిరీస్‌కు కీలక విభాగాల్లో గౌరవం దక్కింది. ముఖ్యంగా నటన విభాగాల్లో రెండు ప్రధాన అవార్డులు సొంతం చేసుకోవడంతో ఈ షో స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. ఈ సిరీస్‌లో తన సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఓవెన్ కూపర్ అత్యంత చిన్న వయసులోనే ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్) గా గోల్డెన్ గ్లోబ్ అందుకుని అరుదైన రికార్డు సృష్టించాడు. అతని ప్రదర్శనపై మొదటి నుంచే విమర్శకుల నుంచి ప్రశంసలు రావడంతో ఈ అవార్డు అతని కెరీర్‌కు కీలక మైలురాయిగా మారింది. 83వ వార్షిక గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ప్రదానోత్సవం కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో ఉన్న బెవర్లీ హిల్టన్ హోటల్ లో అట్టహాసంగా జరిగింది. అదే సమయంలో ఉత్తమ నటుడు (టీవీ సిరీస్) విభాగంలో స్టీఫెన్ గ్రాహంకు అవార్డు లభించింది. సిరీస్‌లో ఆయన పోషించిన పాత్రకు గల లోతు, భావోద్వేగాల తీవ్రత ఈ గౌరవాన్ని అందించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అవార్డు స్వీకరణ సమయంలో ఓవెన్ కూపర్ తన ఆనందాన్ని పంచుకుంటూ, తనతో కలిసి పనిచేసిన అనుభవజ్ఞులైన నటీనటుల నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రయాణమని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఈ ఏడాది గోల్డెన్ గ్లోబ్స్ వేడుకలను మరింత ప్రత్యేకంగా నిలిపేందుకు ప్రముఖ స్టాండ్-అప్ కామెడియన్ నిక్కీ గ్లేజర్తో పాటు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా వ్యాఖ్యాతలుగా వ్యవహరించడం విశేషంగా మారింది. బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు గుర్తింపు పొందిన ప్రియాంక హాజరు ఈ వేడుకకు అదనపు ఆకర్షణగా నిలిచింది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటుల ప్రతిభకు ఈ వేడుక వేదికగా నిలిచింది

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# శరణార్ధులుగా వచ్చి శటగోపం పెడుతున్న ముఠా అరెస్ట్

**నల్గొండ పట్టణ శివారులో భారీ దొంగతనం**
**48 గంటల్లో కేసును ఛేదించిన రూరల్ పోలీస్**
**నిధి పైపుల కంపెనీలో రాత్రి సమయంలో చోరీ**
**నల్గొండ రూరల్ పోలీసుల చాకచక్యంతో**
**ముగ్గురు నిందితుల అరెస్ట్**
**మీడియాకు వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పి జి.రమేష్**



ంంంధర్మఘంట జనవరి 12 నల్లగొండ: బర్మాదేశం నుండి ఇండియాకు శరణార్థులుగా వచ్చి దొంగతనాలు చేస్తున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పి జి.రమేష్ వివరాలు వెల్లడించారు. సోమవారం నల్లగొండ రూరల్ పోలీసులు బుద్దారం రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నిధి పైపుల కంపెనీలో రాత్రి సమయంలో చోరీ చేసిన విషయాన్ని ఒప్పుకున్నారు.నిందితుల నుండి 40 ఇత్తడి సైజర్లు,35అమరాన్ బ్యాటరీలు,యూపీస్ కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ 50 కేజీలు,దొంగతనానికి ఉపయోగించిన యా15ఖఫ్ 4386 నెంబర్ గల ప్యాసింజర్ ఆటోతో పాటు,సుమారుగా రూ.60 లక్షల విలువైన దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బర్మాదేశం నుండి ఇండియాకు శరణార్ధులుగా వచ్చిన నిందితులు ఏ1 హమీద్ హుస్సైన్,ఏ2 జహాంగీర్ ఆలం, ఏ3 షఫిక్ ఆలం పోలీసులకు పట్టుబడగా,మరో నలుగురు నిందితులు ఏ4 మహమ్మద్ ఇస్లాం,ఏ5 కమల్ హుస్సేన్,ఏ6 ఖైసర్,ఏ7 నూర్ ఖాసిం పరారీలో ఉండగా వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.ఈ ముఠా హైదరాబాద్ బాలాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నారని, గతంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ కేసులు నమోదయినట్లు చెప్పారు. అడిషనల్ ఎస్పీ జి.రమేష్ నేతృత్వంలో నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కేసును నల్గొండ డిఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో చురుకుగా వ్యవహరించి చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేసి,24 గంటల్లో కేసును ఛేదించిన



నల్గొండ టూ టౌన్ సీఐ ఎస్.రాఘవరావు,నల్గొండ రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు మరియు నల్గొండ రూరల్ పోలీస్ సిబ్బందిని అడిషనల్ ఎస్పీ మరియు ఏస్పీ అభినందించారు.

# వివేకానందుని బోధనలు వాస్తవాలు!

ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని అతి చిన్న వయసులోనే పరిచయం చేసిన స్వామి వివేకానందుడు వరల్డ్ యూత్ కి ఒక ఐకాన్ గా మారారు.అందుకే ఆయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా పరిగణిస్తారు.ఆయన చేసినటువంటి బోధనలు ప్రపంచ మానవాళికి ఎంతో ఉపయోగకరంగా ఉండేవి ముఖ్యంగా భారతదేశంలో ఉన్నటువంటి ప్రత్యేక పరిస్థితులను కూడా ఆయన తన బోధనల ద్వారా వివరించేవారు. భారతదేశంలో ఉన్న కుల వ్యవస్థను,ఒక మత ధర్మాలను ఆయన ఏనాడు సమ్మతించలేదు.ఆయన ఎక్కడ మాట్లాడినా ప్రపంచ సర్వమత సమ్మేళనం,సర్వమానవాళి క్షేమం గురించే మాట్లాడారు తప్ప, ఫలానా మతం నాది,ఆ పలానా మతాన్ని ఆచరించండి అంటూ చెప్పిన సందర్భం లేదు.కానీ, కాలక్రమేణా వివేకానందుని ఒక మతానికి ప్రతినిధిగా మార్చే ప్రయత్నం పూర్తిస్థాయిలో జరుగుతుంది.ముఖ్యంగా 1893 లో చికాగోలోని పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలిజియన్స్‌లో హిందూ ఇజంను ప్రపంచానికి పరిచయం చేసినందుకు వివేకానందుడు హిందూ మతానికి ప్రతినిధిగా గుర్తింపు పొందాడు.అతను హిందూఇజంని ఒక యూనివర్సల్,సహనశీల మతంగా చిత్రీకరించాడు.ఇది అన్ని మతాలను సమానంగా గౌరవించే సార్వత్రిక సత్యాన్ని ఆధారంగా చేసుకుంది.అయితే, అతను సాంప్రదాయ హిందూఇజంని రిఫార్మ్ చేసే వ్యక్తిగా కూడా చూడవచ్చు. సూపర్‌స్టిషన్స్ మరియు సంకుచితత్వాన్ని వ్యతిరేకించాడు.వాస్తవానికి వివేకానందుడు చెప్పినది అతను హిందూఇజంని వేదాంత ఆధారంగా వివరించాడు. ఇందులో అద్వైత మరియు విశిష్టాద్వైత సిద్ధాంతాలను సమన్వయం చేశాడు.అతను అన్ని మతాలు ఒకే సత్యానికి మార్గాలని నమ్మాడు."సత్యం ఒక్కటే దాన్ని వివిధ పేర్లతో పిలుస్తారు" అని చెప్పాడు. కుల వ్యవస్థను సంప్రదాయ రూపంలో వ్యతిరేకించాడు.దాన్ని భారతదేశ పతనానికి కారణంగా చూసి, గుణాలు మరియు కర్మ ఆధారంగా మార్చాలని సూచించాడు.హిందూఇజం బుద్ధిజంతో కలిసి ఉండాలని, సమాజానికి స్వేచ్ఛ ఇవ్వాలని చెప్పాడు.అతని బోధనలు సేవ,ఐక్యత మరియు అందరికీ మోక్షంపై దృష్టి



గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్

సారించాయి, మతాల మధ్య సామరస్యాన్ని ప్రోత్సహించాయి.ఇప్పుడు హిందూ మతానికి చెందిన కొందరు ముఖ్యంగా హిందుత్వ సంస్థలు చేస్తున్న ప్రచారం ఆయన బోధనలకు విరుద్ధంగా ఉంది.వివేకానందుని భోధనలు హిందూ ఆధిపత్యం మరియు నేషనలిజం కోసం తప్పుగా రుద్దె ప్రయత్నం చేస్తూ,అతనిని హిందుత్వ పితామహుడిగా చిత్రీకరిస్తున్నారు.కానీ,అతని అసలు బోధనలు వేరే విధంగా ఉన్నాయి.అందరినీ కలుపుకోని పోవాలని, విభిన్నతలను ఆమోదించు మరియు సహజంగా ఉండనివ్వమని చెప్పిన మాటలు హిందుత్వకు వ్యతిరేకంగా ఉన్నాయి.అతను మత సమానత్వం,కుల వ్యవస్థలోని లోపాలను,అసమానతలను, వివక్షను తగ్గించడం లేదా సరిచేయడం కోసం చేసే సామాజిక,చట్టపరమైన, ఆలోచనాపరమైన మార్పులు లేదా సంస్కరణలు రావాలని ప్రోత్సహించాడు.కొందరు అతని మాటలను సెలెక్టివ్‌గా ఉపయోగించి హిందూ శ్రేష్ఠత్వాన్ని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇది అతని యూనివర్సల్ విజన్‌కు విరుద్ధంగా ఉందని అర్థం చేసుకువాలి.మరికొందరు అతన్ని యాంటీ-హిందూ లేదా ఒక ప్రాంత ప్రతినిధిగా చిత్రీకరిస్తున్నారు. కానీ,అతను ఆధిపత్యవాది కాదు,"కాస్మోపాలిటన్ పాట్రియాట్".అనగా ప్రపంచ పౌరుడు,అందరూ సమానులే అని భావించేవాడు,విభిన్న సంస్కృతులు,మతాలు, దేశాలను గౌరవించేవాడు, ఇక్కడ-అక్కడ అందరినీ ఒకే మానవ సమాజంగా చూసేవాడు. అదే సమయంలో దేశభక్తుడు, తన దేశం(స్వదేశం)పట్ల బలమైన అనుబంధం,ప్రేమ,సేవాభావం కలిగినవాడు.భారత స్వాతంత్ర్యానికి ఆధ్యాత్మిక ఫౌండేషన్ ఇచ్చాడు.అతని మత దృక్పథం ప్రారంభంలో మతాలను వేదాంత స్థాయిలుగా చూడటం నుంచి నాలుగు యోగాల ద్వారా అన్ని మతాలు సమాన మార్గాలకు తేవడం వరకు మారింది.కుల వ్యవస్థను వ్యతిరేకించి,గుణాల ఆధారంగా రిఫార్మ్ సూచించాడు. రామకృష్ణుని అవతారంగా గౌరవించాడు.కానీ,మోడరన్ హిందూ నేషనలిస్టులు అతన్ని మిస్‌యూజ్ చేస్తున్నారు.అతని బోధనలను సెలెక్టివ్‌గా హిందూ శ్రేష్ఠత్వానికి ఉపయోగిస్తున్నారు. కానీ,అతని అసలు దృష్టి కోణం వేరేలా ఉండేది.విభిన్న సంస్కృతులు,జాతులు,మతాలు,కులాలు లేదా సమూహాలు తమ స్వంత గుర్తింపు,సంప్రదాయాలు, భాష,ఆచారాలను వదిలేసి ఒక ప్రధాన డామినెంట్ సంస్కృతిలో పూర్తిగా కలిసిపోవాలన్నాడు.అంటే స్థానికంగా కాకుండా,ప్రపంచ స్థాయిలో లేదా సార్వత్రిక సూత్రంగా అమలు చేయాలని భావించడమే కదా.అయినా ఆయనను "అందరూ ఒకేలా అవ్వాలి" అనే ఆలోచన కలిగిన వ్యక్తిగా చూడకుండా తప్పుగా భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తున్నారు.ప్రపంచ సమాజంలో విభిన్నతలు తగ్గించి,ఏకరూప సమాజం సృష్టించడం కోసం కలలుగన్న స్వామి వివేకానందున్ని ఒకదేశానికి,ఒక మతానికి పరిమితం చేయడం అంటే ఆయనను తప్పుగా చూపిస్తున్నారనే కదా.ప్రజలు వాస్తవాలను గ్రహించకపోతే అవాస్తవాలే అసలైన నిజలుగా ముద్రపడి పోతాయి.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రారంభించిన కోదాడ కోర్టు సీనియర్,జూనియర్ జడ్జీలు**
**పాల్గొన్న మహిళ న్యాయవాదులు,మహిళా కోర్టు సిబ్బంది**
**ముగ్గులు వేసిన విజేతలకు బహుమతుల ప్రధానం**

**ధర్మఘంట జనవరి 12 కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడ కోర్టులో సోమవారం సంక్రాతి పర్వదినాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళ న్యాయవాదులకు, మహిళా కోర్టు సిబ్బందికి కోర్టు ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య మాట్లాడుతూ మహిళలు ఇంటిపనులు,ముగ్గులు తమ రోజువారీ కార్యక్రమాల ద్వారా ఎంతో శారీరక శ్రమ చేస్తున్నారని, ఆ శ్రమనే వారి ఆరోగ్యాలకి హేతువు అవుతుందన్నారు. పండగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిస్తాయన్నారు. సంక్రాంతి పండుగ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఘనంగా జరుపుకుంటారన్నారు. ముగ్గులు మహిళలలోని సృజనాత్మక ఆలోచనలు,శక్తిని బయటపెడతాయన్నారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎండి.ఉమర్,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య,కోశాధికారి కోడూరు వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సామా నవీన్,ఎస్వీ చలం,కానుగు మురళి,సీనియర్ న్యాయవాదులు సాధు శరత్ బాబు,బెల్లంకొండ గోవర్ధన్,పి.పి. గౌస్ పాషా,మంద వెంకటేశ్వర్లు, రియాజ్,తాటి మురళి,కె.శరత్ కుమార్,పి.ఉపేందర్,ప్రసాద్, సంతోష్ నాయక్,సూపరింటెండెంట్స్



సిహెచ్. సౌమ్య, కె.రజనీదేవి,సోహెల్,భరత్ కుమార్,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులు 'డే'కేర్ సెంటర్ సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు**





ధర్మఘంట జనవరి 12 సూర్యాపేట

వయోవృద్ధులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డే'కేర్( వృద్ధుల ఆనందనిలయం) సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగులు, వయోవృద్ధులు,ట్రాంజెండర్స్ సాధికారత శాఖ,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రణామం వయోవృద్ధుల 'డే' కేర్ సెంటర్ ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు నాలుగు గోడల మధ్యలో ఉండకుండా నలుగురితో కలిసి కాసేపు కాలక్షేపం చేయడం కోసం 'డే' కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. వృద్ధుల కోసం 'డే' కేర్ సెంటర్లో ఆట వస్తువులను న్యూస్ పేపర్లను,స్ఫూర్తిదాయకమైన స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారం అందించడం స్వాగతిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్ పర్సన్ ఇరుగు కోటేశ్వరి,తోట శ్యామ్, న్యాయవాదులు శశిధర్, రమాదేవి,సీనియర్ సిటిజెన్లు హమీద్ ఖాన్,విద్యాసాగర్, గుండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## 23న టీడబ్ల్యూజేఫ్ సూర్యాపేట జిల్లా మహాసభ

**కరపత్రం ఆవిష్కరించిన అడ్ హక్ కమిటీ**
**మహాసభను విజయవంతం చేయాలని పిలుపు**



ధర్మఘంట జనవరి 12 సూర్యాపేట: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం,హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా 4వ,మహాసభ ఈనెల 23న జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున జరుగుతుందని ఫెడరేషన్ జిల్లా అడ్ హక్ కమిటీ నాయకులు ప్రకటించారు.ఈ మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని కమిటీ నేతలు సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా సంఘం మహాసభలు జరుగుతున్నాయని,అందులో భాగంగా 23న సూర్యాపేట జిల్లా మహాసభ జరుపుతున్నామన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా,జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్నది కేవలం తమ సంఘమేనని,సమస్యలపై త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ ఉంటుందన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలైన అక్రెడిటేషన్లు,ఇండ్లు, ఇండ్ల స్థలాల,హెల్త్ కార్డులు, పెన్షన్,జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య,ఉచిత బస్ పాస్ తదితర డిమాండ్ల సాధనకు టీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఫెడరేషన్ చేస్తున్న పోరాటాలకు జిల్లాలోని జర్నలిస్టులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పాల్వాయి జానయ్య,కో కన్వీనర్లు ముషం హరిప్రసాద్,లింగాల సాయిబాబా,నందిపాటి సైదులు, శ్రీరామల కృష్ణ,తాందార్ పల్లి శ్రీనివాస్,గూడపూరి ప్రభాకర్, పాల్వాయి అజయ్,పి.సతీష్, ఎస్.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ విజన్ క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు




ధర్మఘంట, జనవరి 12, సూర్యాపేట: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి 104ఏ రీజియన్ 6 రీజియన్ చైర్మన్ జూలకంటి నాగరాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు మరియు వంటల పోటలను స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ విజన్ క్లబ్, వాసవికపుల్స్ క్లబ్, వాసవి వనితా క్లబ్ ల సభ్యులు పాల్గొన్నారు. దాదాపుగా వంద మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొని సంక్రాంతి పండుగ ను ప్రతిబింబించే రంగురంగుల ముగ్గులు వేశారు. కొందరు దేవతా మూర్తులు, మహిళా శక్తిని తెలిపే ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి వెట్ గ్రైండర్, రెండవ బహుమతి మిక్సీ, మూడో బహుమతి కుక్కర్ లను శ్రేష్ఠ హాస్పిటల్ వారు అందజేశారు. వంటల పోటీలో పాల్గొన్న వారికి మొదటి బహుమతి రెండవ బహుమతి మూడవ బహుమతిగా చీరలను గండూరి షాపింగ్ మాల్ యజమాని గండూరి పావని కృపాకర్ అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళలకు శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీ వారు బహుమతులు అందించారు. అలాగే వాసవి వనిత క్లబ్ నుండి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. బానుపురి సేవా బృందం శ్రీరంగం రాము, సన్ సిటి చపాతి సెంటర్ ఆద్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుధాకర్ విజన్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మీలా వీరమణి వాసుదేవ్ ఐఇసి ఆఫీసర్ సింగిరికొండ రవీందర్, తోట శ్యాం ప్రసాద్, ఐపీసీలు మిట్టపల్లి రమేష్, డిస్టిక్ ఇన్చార్జ్(గోసేవ) కలకోట లక్ష్మయ్య, రీజియన్ సెక్రెటరీ కలకోట అనిత, జోన్ చైర్మన్ బుద్ధ భానుతేజ, ఆర్సి చల్లా లక్ష్మయ్య వంగవీటి రమేష్ రీజియన్ ఫస్ట్ లేడీ జూలకంటి సంధ్య, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు బుద్దా శ్రవణ్ కుమార్ గుప్తా, సుధాకర్ విజన్ అధ్యక్షులు వంగవీటి సుజాత , సెక్రటరీ పైడిమర్రి స్వప్న, కోశాధికారి తోట అనురాధ, వనిత క్లబ్ సెక్రటరి బేలిదే శ్రీలక్ష్మి, వాసవి వనిత క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ గుండా ప్రమిల, మిట్టపల్లి శ్రీదేవి, రాచకొండ జ్యోతి, శ్రీరంగం రాము, బజ్జూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

**భారతదేశ సంస్కృతిని,ఆధ్యాత్మికతను ప్రపంచ నలుమూలల తెలియజేసిన మహనీయుడు వివేకానంద**

**యువత ఆయన స్ఫూర్తిగా ఆసక్తి ఉన్న రంగాలలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి**

**సూర్యాపేటలో ఘనంగా జాతీయ యువజనోత్సవ వేడుకలు.. ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**






ధర్మఘంట జనవరి 12 సూర్యాపేట

భారతీయ సంస్కృతిని,ఆధ్యాత్మికతను ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియడారు.సూర్యాపేట పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో సోమవారం జిల్లా యువజన సర్వీసులు మరియు క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ "లేవండి, మేల్కొనండి,గమ్యం చేరే వరకు విశ్రమించకండి" అన్న వివేకానందుని పిలుపు నేటి తరం యువతకు దిక్సూచి అని కొనియాడారు.విదేశాల్లో సైతం భారత దేశ ఔనత్యాన్ని చాటి చెప్పిన ఆయన ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.తక్కువ వయస్సులోనే ఎక్కువ విజయాలు సాధించి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన స్వామి వివేకానంద ఆలోచనలకు అనుగుణంగా,వారు చూపిన మార్గాలలో నడుస్తూ యువత చదువు,క్రీడలు,ఐటి,సైన్స్ మరియు టెక్నాలజీ,ఏఐ లాంటి ఆసక్తి ఉన్న రంగాలలో వినూత్నంగా ఆలోచించి,దృఢ సంకల్పంతో ముందుకు



వెళ్తు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.నీది,నాది అని కాకుండా సమాజం గురించి అలోచించి సమస్యలను పరిష్కరించే ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకున్న యువతేనని అన్నారు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కల్గిన దేశమని, ఆర్థిక వ్యవస్థలో 4వ,స్థానానికి చేరుకుందని,నైపుణ్యాలను పెంపొదించుకుంటూ, సామర్థ్యలను పెంచుకొని,మంచి ఆలోచనలతో ముందుకు వెళ్తే సమాజంలో గుర్తింపు దక్కటంతో పాటు మన ఊరు,మండలం, జిల్లా,రాష్ట్రం,దేశంను అభివృద్ధి చేసుకోవచ్చున్నారు.అనంతరం జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ స్వామివివేకానంద జన్మ దినోత్సవాన్ని జాతీయ యువజన దినోత్సవగా జరపటం సంతోషమని,అతి చిన్న వయసులోనే భారతదేశ ఔనత్యాన్ని విదేశాలకు తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి అని,భారతదేశంలో 60 శాతానికి పైగా యువతే ఉన్నారని,యువత భారతదేశానికి గొప్ప వనరులు అని,వారిని ఉన్నతంగా తీర్చిదిద్దితే భారతదేశం ప్రపంచ దేశాల్లో మొదటి స్థానానికి చేరుకుంటుందన్నారు.యువత మత్తు కోసం మాదకద్రవ్యాల వైపు,ఈజీ మనీ కోసం సైబర్ క్రైమ్ వైపు వెళ్లకుండా స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని,నేర రహిత సూర్యాపేటగా తీర్చిదిద్దేందుకు యువత అందరూ కలిసి రావాలని కోరారు.అనంతరం స్వామి వివేకానంద దినోత్సవం సందర్బంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వం,క్విజ్ పోటీలలో ప్రతిభ చూపెట్టిన వారికి కలెక్టర్,ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి,తహసీల్దార్ కృష్ణయ్య,మాజీ మన్సిపల్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ,అన్నపూర్ణ, వివేకానంద ఉత్సవకమిటీ చైర్మన్ నాగార్జున,కార్యదర్శి ప్రభాకర్, సభ్యులు,పుర ప్రముఖులు, యువత,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అరైవ్-ఎలైవ్ ప్రోగ్రాం

**అరైవ్-ఎలైవ్ కరపత్రం ఆవిష్కరించిన ఎస్పీ.. పౌరులు బాధ్యతగా ఉండాలి**

**ప్రమాదాలు జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు అందించాలి.. పోలీసు వారికి,అంబులెన్స్ కు సమాచారం అందించాలి**

**సకాలంలో స్పందించి సహాయ సహకారాలు అందిస్తే రహదారి హీరోగా గుర్తింపు**







ధర్మఘంట జనవరి 12 సూర్యాపేట:

రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,రోడ్డు ప్రమాదాల నిర్మూలన,రోడ్డు భద్రత పట్ల ప్రజలకు మరింతగా చేరువై అవగాహన కల్పించడానికి రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ప్రారంభించిన "అరైవ్-ఎలైవ్" కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి, రోడ్డు భద్రత పట్ల ప్రజలను మరింతగా చైతన్య పరుస్తామని జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు.రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,డిసిఆర్బీ డిఎస్పీ రవిలతో కలిసి ఆరైవ్-ఎలైవ్ అవగాహన కరపత్రాన్ని ఎస్పీ ఆవిష్కరించారు.పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి రోడ్డు అరైవ్-ఎలైవ్ కార్యక్రమం ఉద్దేశాన్ని,లక్ష్యాన్ని గురించి వివరించారు.రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల నిర్వహణ దీని ఉద్దేశ్యం ప్రతి కాలనీకి,ప్రతి గల్లీకి,ప్రతి గ్రామానికి,ప్రతి విద్యార్థికి,ప్రతి పౌరునికి చేరాలని,ప్రజలు ప్రతి ఒక్కరూ దీనిలో పాల్గొని అవగాహన కలిగేలా పోలీస్ సిబ్బంది పనిచేయాలని సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దీనికోసం జిల్లా వ్యాప్తంగా ప్రజలను, విద్యార్థులను,పౌరులను అవగాహన కార్యక్రమాల్లో భాగం చేస్తున్నామని,రోడ్డు భద్రత,రోడ్డు నియమ నిబంధనలు,ప్రమాదాల నిర్మూలనకై తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. సూర్యాపేట,కోదాడ మున్సిపాలిటీ కేంద్రాల్లో వార్డుల వారిగా రోడ్డు భద్రతా కమిటీలు, మండల పరిధిలో గ్రామాల వారిగా రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరి ప్రాణం పోవద్దు అనేది పోలీస్ శాఖ ముఖ్య ప్రణాళికని తెలిపారు.రోడ్డు భద్రతా మసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర డిజిపి శ్రీ.శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో అరైవ్-ఎలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు.రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారిని రహదారి హీరోగా గుర్తించడం జరుగుతుందని,నగదు ప్రోత్సాహం కూడా అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,డిసిఆర్బీ డిఎస్పీ రవి,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు,ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుడిని వారి బంధువుకు అప్పగింత

ధర్మ ఘంట జనవరి 12 సూర్యాపేట జిల్లా ప్రతినిధి:

జిల్లా కేంద్రంలోని కాసర బాధ క్రాస్ రోడ్ లో గల అపూర్వ దివ్యాంగుల పాఠశాల లో తల్లిదండ్రులు లేని మానసిక వికలాంగుడైన బత్తుల పవన్ కుమార్ వయస్సు( 27) సంవత్సరాలు గ్రామం పరకాల జిల్లా వరంగల్ కు చెందిన విద్యార్థి కి గత ఐదు సంవత్సరముల నుండి హాస్టల్ వసతుల తో కూడిన విద్యను అందించాము. పవన్ యొక్క సమాచారం తెలుసుకొని వచ్చినటువంటి విద్యార్థి బంధువు శాంతా కుమార్ కి సోమవారం అప్పగించడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ మదనాచారి విలేకరుల సమావేశంలో తెలిపారు.



## ఎన్టీవీతో సహా పలు ఛానళ్ళపై కేసులు నమోదు అరెస్టులు ఖాయమే...!?

మీడియా,డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో వ్యక్తిత్వంపై దాడి చేసే కథనాలు ప్రసారం చేసిన ఎన్టీవీతో పాటు డిజిటల్ మీడియా ఛానల్స్ పై కేసులు నమోదయ్యాయి.ఈ కథనాల్లో ఎక్కడా స్పష్టమైన ఆధారాలు లేనప్పటికీ,సదరు అధికారిణి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మరియు అధికారుల నైతిక ధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా పరిగణించింది.ఈ మేరకు అవాస్తవ ప్రచారాలు చేస్తున్న ఛానళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు.ఐఏఎస్ అధికారుల సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు,ఎన్టీవీ తో పాటు పలు డిజిటల్ మీడియా సంస్థలు మరియు యూట్యూబ్ ఛానళ్లపై కేసు నమోదు చేశారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న మహిళా అధికారిణిపై ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండా కథనాలను ప్రసారం చేయడం చట్టవిరుద్ధమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టుల మూలాలను కనిపెట్టేందుకు, అలాగే ఈ వార్తలను ప్రోత్సహించిన వారిని గుర్తించేందుకు పోలీసులు ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు.ఈ మేరకు సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు సమాచారం.ఈ వ్యవహారంలో జరుగుతున్న తప్పుడు ప్రచారం వల్ల పాలనా యంత్రాంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఐఏఎస్ అధికారుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా వ్యూయర్ షిప్ కోసం అధికారుల వ్యక్తిగత జీవితాలను రోడ్డుపైకి లాగడం సరికాదని వారు స్పష్టం చేశారు.భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఇతరుల ప్రతిష్టకు భంగం కలిగించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

## క్రీడాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



ధర్మ ఘంట జనవరి 12, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:

క్రీడలు శరీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బిజెపి జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జె ఎస్ స్పోర్ట్స్ బాక్స్ క్రికెట్ స్టేడియం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. చిన్నతనం నుంచి క్రీడాల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని, క్రీడ పోటీల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటమిలో పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రికెట్ స్టేడియాన్ని సూర్యాపేట యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని ఈ స్టేడియంలో రెండు గంటలకు ఉదయం 900 రూపాయలు, నైట్ 1100 అని, మూడు గంటలకు ఉదయం 1300 రూపాయలు నైట్ 1600 అని ఈ అవకాశాన్ని సూర్యాపేట యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల మధు గౌడ్, సలిగంటి నాగయ్య, సలిగంటి ఉప్పలయ్య, నిమనగోటి వెంకట్, రవీందర్, సత్యం, నరేష్, మధు, సత్యం, పోలగాని ఉపేందర్, ఖమ్మంపాటి మధు తదితరులు పాల్గొన్నారు.


## మా భూమిని ఆక్రమించుకుంటామంటూ పంటను నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ధర్మ ఘంట జనవరి 12, సూర్యాపేట జిల్లా ప్రతినిధి



మా భూమిని ఆక్రమించుకుంటామంటూ పంట పొలాన్ని నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నడిగూడెం మండలం రామాపురం గ్రామం చెందిన భూసరాజు రామారావు, భూసరాజు రాజయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రామాపురం రెవెన్యూ పరిధిలో 190/659 మరియు 190 / 660 సర్వే నెంబర్లు కింద దాదాపు 5 ఎకరాల పొలం ఉంది . మా తండ్రి వారసత్వం ద్వారా భూమిని హక్కు కలిగి 30 సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామ న్నారు. ఈ భూమికి సంబంధించి వారి వద్ద ధరణి మరియు భూ భారతి కి సంబంధించిన అన్ని పహాని మరియు పాస్ పుస్తకాలు డిజిటల్ సైన్ చేసిన ఉన్నాయని తెలిపారు. అయితే మేడం లక్ష్మమ్మ, మేడం అరుణ మరియు మొగిలి లక్ష్మమ్మ వారి కుటుంబ సభ్యులు కలిసి మా భూమి పైకి వచ్చి గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో పంట పొలాన్ని గడ్డి మందు జల్లి నాశనం చేశారని తెలిపారు. అనేకమార్లు ఇబ్బంది కలిగించినప్పుడు ఎమ్మార్వో దృష్టికి తీసుకపోవడం జరిగిందన్నారు. సుమారు ఐదులక్షల వరి పంట నాశనం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎటువంటి కేసులు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరల సుమారు రెండు నెలల పది రోజుల వరి పంట పైన జనవరి 9 2026 వ తారీఖున మొగిలి లక్ష్మమ్మ,నడిగూడెం వాస్తవ్యురాలు ,మేడం లక్ష్మమ్మ రామాపురం మరియు మేడం అరుణ మా ఐదెకరాల పొలం పైన వరి పంటను నాశనం చేసే రౌండప్ వంటి మందులు పిచికారి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాపైన దౌర్జన్యానికి పాల్పడుతూ మా భూమిని ఆక్రమించకుండా మా భూమి మాకు దక్కేల విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

## నీటి హక్కులపై కవిత ఘాటు వ్యాఖ్యలు



కృష్ణా,గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాపాడలేదని మరోసారి స్పష్టం అయిందని మాజీ ఎమ్మెల్సీ,బీఆర్ఎస్ బహిష్కృత నేత,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీటి పంపకాల విషయంలో పొరుగు రాష్ట్రాలతో పేచీలు పెట్టుకోవడం ఇష్టం లేదన్న ఈ ముఖ్యమంత్రి చేతగాని మాటలు న్యాయ పోరాటంలోనూ ప్రతిఫలించడం తెలంగాణ రాష్ట్రం చేసుకున్న దురదృష్టమని వ్యాఖ్యానించారు.ఏపీ ప్రభుత్వం కేంద్ర సర్కారు అండతో అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై విచారణ అర్హత లేని పిటిషన్ వేసి రాష్ట్రం హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు.నీటి సోయి లేని ముఖ్యమంత్రి, ప్రభుత్వంలోని ఇతర ముఖ్యుల వల్ల తెలంగాణ నీటి హక్కులకు పెను నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.ఏపీ ప్రభుత్వ అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి న్యాయ పోరాటం చేస్తుందని,తెలంగాణ హక్కుల పరిరక్షణ ధ్యేయంగా ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

# తెలుగు సంప్రదాయాల ప్రతిబింబంగా రంగవల్లుల ముగ్గులు





**ప్రత్యేక ఆకర్షణగా గంగిరెద్దుల విన్యాసాలు**
**36వ,వార్డు లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు**

ధర్మ ఘంట జనవరి 12, సూర్యాపేట జిల్లా ప్రతినిధి

తెలుగు సాంప్రదాయానికి ప్రతిబింబంగా రంగురంగుల ముగ్గులు నిలుస్తాయని మాజీ మునిసిపల్ చైర్పర్సన్ న్ గండూరి ప్రవళిక ప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజారామ్ కళాశాల సమీపంలోని 36వ వార్డు లో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు విజేతలకు బహుమతులు అందజేసి



మాట్లాడారు . ముగ్గులు మహిళల్లో ఉన్న సృజనాత్మక తను వెలుగులోకి తీసుకొస్తాయని తెలిపారు. రంగురంగుల ముగ్గులతో ఈ ప్రాంతం రంగుల మయంగా మారిందన్నారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, మొత్తం 90 మంది తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి సాధించన విజేతలకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గండూరి ప్రవల్లిక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్గూరి రామ్మూర్తి, గుండ గాని నరసయ్య,ఆంగోతి వెంకన్న, ప్రతాప్ రెడ్డి, హరీష్, మోహన్, జనార్దన్, చందు, నందు, రాధిక లత, స్రవంతి, శోభ, సత్యం, జవాన్లు హనుమంతు మల్లేష్ వార్డు మహిళలు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ యంత్రాల పంపిణీ

**ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రారంభించిన ఎంపీ చామల**
**ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్లతో కలిసి లబ్దిదారులకు అందజేత**
**రైతుల ఆదాయం పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**





ధర్మఘంట జనవరి 12 ఆలేరు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాయితీపై అందజేస్తున్న రాయితీ యంత్రాల లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,రైతులతో ముచ్చటించి,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ చామల మాట్లాడుతూ...రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తోందన్నారు. ఆధునిక యంత్రాల వినియోగంతో వ్యవసాయ ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. మొత్తం 316 పనిముట్లు లేదా యూనిట్ల ప్రభుత్వం మంజూరు చేసిందని,దానికోసం రూ. 1.27 లక్షల కోట్ల బడ్జెట్ ప్రభుత్వం మంజూరు చేసిందని, గ్రౌండెడ్ ఇంప్లిమెంట్ల సంఖ్య 177 కాగా,జిల్లా వినియోగించిన బడ్జెట్ రూ. 0.58 లక్షలని,జిల్లాను కేటాయించిన సబ్సిడి మొత్తం రూ. 127 లక్షలని చెప్పారు. ఇందులో ఆలేరు నియోజకవర్గానికి రూ. 55.84 లక్షలు,భువనగిరి నియోజకవర్గానికి రూ. 32.34 లక్షలు,నకిరేకల్ నియోజకవర్గానికి రూ. 9.39 లక్షలు,మునుగోడు నియోజకవర్గానికి రూ. 12.11 లక్షలు,తుంగతుర్తి నియోజకవర్గానికి రూ. 12.27 లక్షలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖా అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడిగా బందు శ్రీధర్ బాబు

**ప్రధాన కార్యదర్శిగా పాయిలి వెంకటనారాయణ ఎన్నిక... ఎనిమిది - రెండు తేడాతో ఎంపిక చేసిన ఎన్నికల సమన్వయ కమిటీ**
**కోదాడలో ఘనంగా జరిగిన పెరికకుల సంఘం సర్వసభ్య సమావేశం.. అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు, ముగ్గుల పోటీలు.**
**సూర్యాపేట జిల్లాలో గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచ్ లకు రాష్ట్ర పెరిక కుల సంఘం తరపున ఘన సన్మానం.**

ధర్మ ఘంట జనవరి 12, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:

సూర్యాపేట జిల్లా పెరుకకుల సంఘం 766/2014 సర్వసభ్య సమావేశం మరియు సంక్రాంతి వేడుకలు మరియు సర్పంచులు ఉప సర్పంచ్లకు సన్మాన కార్యక్రమం సోమవారం కోదాడ పెరిక హాస్టల్లో ఘనంగా జరిగాయి. పెరిక హాస్టల్ అధ్యక్షుడు హస్నాబాద్ రాజేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఘటిక విజయ్ కుమార్, పెరిక విద్యార్థి వసతి గృహం అధ్యక్షుడు డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, కోకాపేట ఆత్మగౌరవ భావన కమిటీ చైర్మన్ సుందరి వీరభాస్కర్, పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి సుంకరి ఆనంద్, సంక్షేమ సమితి అధ్యక్షులు బత్తిని పరమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన పిసిసి సభ్యులు శ్రీ దొంగరి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

**8- 2 తేడాతో కొత్త కమిటీని ఎన్నుకున్న సమన్వయ కమిటీ :**

సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షుని ఎన్నిక చేయడం కోసం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున మొత్తం 12 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు అయింది. ఈ సమన్వయ కమిటీలోని ఎనిమిది మంది సభ్యులు డాక్టర్ రాము, దొంగరి వెంకటేశ్వర్లు, కీత భద్రయ్య, యరంశెట్టి పిచ్చయ్య, శిరంశెట్టి వెంకన్న, మార్త కృష్ణమూర్తి, దాచపల్లి వెంకన్న, పుల్లూరి అచ్చయ్య బందు శ్రీధర్ బాబు అధ్యక్షుడుగా ఉండాలని అభిప్రాయపడ్డారు. మెజారిటీ ఆధారంగా అధ్యక్షుడిగా శ్రీధర్ బాబు పేరును జిల్లా సమన్వయకర్త దొంగరి వెంకటేశ్వర్లు ప్రకటించారు. దాంతోపాటు ప్రధాన కార్యదర్శిగా పాయిలి



వెంకటనారాయణ ను కమిటీ ఎన్నుకున్నది. ఈ ఇద్దరికీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

**అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు :**

కోదాడ పెరిక హాస్టల్లో సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. మహిళలకు ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ముగ్గుల పోటీలో విజేతలకు రాష్ట్ర సంఘం నాయకులు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**సర్పంచులు ఉపసర్పంచ్ లకు ఘన సన్మానం :**

సూర్యాపేట జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజేతలైన సర్పంచులు ఉపసర్పంచ్ లకు రాష్ట్ర పెరిక సంఘం నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, దొంగరి నాగేశ్వర్రావు,బాల్తు శ్రీనివాస్, జడ్జి చిత్తలూరి సత్యనారాయణ, జిల్లా నాయకులు పాయిల కోటేశ్వరరావు, తొగరు రమేష్, పాయిలి వెంకటేశ్వర్లు, పాయిలి జయరామయ్య, దొంగరి శ్రీనివాసరావు, సుందరి వెంకటేశ్వర్లు, రామినేని సత్యనారాయణ,బచ్చు శ్రీనివాస్, తీపిరిశెట్టి రాజు, సాదే లక్ష్మి నారాయణ, భాదే రాము, బూడిగెం రాజేష్,గుండు మధు,గుండు అనురాధ,పాయిల సుశీల, కంటెమ్ బాబు,రాష్ట్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు సుంకరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీత విజయ్ కుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గజ్వేల్ సత్యనారాయణ, కోకాపేట ఆత్మగౌరవ భవన కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచాల బాలరాజు శ్రీనివాస్, పెరిక విద్యార్థి వసతిగృహం ప్రధాన కార్యదర్శి అచ్చా రఘుకుమార్, కోశాధికారి బాల్దురి రవికుమార్, ఎల్బీనగర్ జోన్ అధ్యక్షుడు బుద్దే వెంకటేశ్వర్లు, అడ్వకేట్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ జూకూరి మహేష్, యువజన విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మైలారిశెట్టి శెట్టి చైతన్య, ఎల్బీనగర్ జోన్ ప్రధాన కార్యదర్శి ముత్తినేని వెంకన్న తదితర నాయకులు దాదాపు వెయ్యిమంది స్వసంఘీయులు పాల్గొన్నారు.

## కోతుల ఆహార సేకరణ కేంద్రం ప్రారంభం




ధర్మఘంట, జనవరి 12, నర్సాపూర్:

నర్సాపూర్ ఫారెస్ట్ పరిధిలో అర్బన్ పార్క్ ఎదురుగా కోతుల కోసం ప్రత్యేక ఆహార సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. వూన్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వారధి ఫౌండేషన్, తెలంగాణ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సహకారం తో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు వాకిటి సునీత ముఖ్య అతిధి గా హాజరు అయ్యి ఫుడ్ కోర్టు ను ప్రారంభించారు. అదే విధంగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ రాష్ట్ర ప్రధాన అటవీ ముఖ్య సంరక్షణ అధికారి రఘు వీర్, ఉత్తర ప్రదేశ్ రిటైర్డ్ ప్రధాన అటవీ ముఖ్య సంరక్షణ అధికారి కె ప్రవీణ్ రావ్,మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ ప్రతేక ఆహ్వానితులుగా హాజరుయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ నర్సాపూర్ ఫారెస్ట్ ఏరియాలో కోతులు ఆహారం దొరకక రోడ్ల పైకి వచ్చి వాహనాల తాకిడి కి మరణిస్తున్నాయి అని అదే విధంగా వాహన చోదకులు కూడా తరచుగా ప్రమాదలకు గురి అవుతున్నారని అన్నారు. ఈ సమస్య ను నివారించడానికి ఓన్ హాండ్స్ ఫౌండేషన్ వారు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. కోతులు లను దైవంగా భావించే సమాజంలో వాటి కోసం ఆహార కేంద్రాన్ని ప్రారంభంచడం చాలా మంచి ఆలోచన అని అన్నారు. అదే విధంగా రిటైర్డ్ అధికారి రఘు వీర్ మాట్లాడుతూ కోతులు ద్వారా ప్రజలు ఎలా ఇబ్బందులు పడుతున్నారో కోతులు కూడా ప్రజల ద్వారా ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ప్రజలు రోడ్ల పై వేసే ఆహారం వలెనే కోతులు అడవిని వీడి మైదాన ప్రాంతాలకు వస్తున్నాయి అని అన్నారు. కోతుల బిహేవియర్ కంటే ముందు మనుషుల మైండ్ సెట్ మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్బంగా వూన్ హాండ్స్ ఫౌండేషన్ వారికి పలు సూచనలు చేశారు. అదే విధంగా వూన్ హాండ్స్ ఫౌండేషన్ చైర్మెన్ దేవులపల్లి పరమేశ్వరి మాట్లాడుతూ సుమారుగా 11 కిలో మీటర్ల మేర ఉన్న ఫారెస్ట్ రోడ్డు లో ప్రతి రోజు వాహనాలు ఢీ కొని కోతులు మరణిస్తున్నాయని అన్నారు. ప్రజలు రోడ్లపై ఆహార పదార్థాలు వేయటమే ఇందుకు ప్రధాన కారణం అని అంతే కాకుండా అడవిలో కనీసం సీజనల్ వారి పండ్ల చెట్లు కూడా లేకపోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుందని అన్నారు. అందుకే ఈ ఆహార సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సేకరించిన ఆహారాన్ని ఫారెస్ట్ లోపల కి చేర్చి కోతులను రోడ్లపై కి రాకుండా చేయడం, అడవిలో అనేక రకాల పండ్ల చెట్లను నాటడం,కోతుల జనాభా పెరగకుండా వాటికి గర్భ నియంత్రన చేయడం ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అటవీ శాఖ అధికారి ఎమ్ జోజి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్, వారధి ట్రస్ట్ సభ్యులు ఇమ్రాన్, జలజీవన్ ఉమెన్ ఎమ్ పవర్మెంట్ సొసైటీ చైర్మన్ రవి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా జడ్పీహెచ్ఎస్ కుడకుడ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధర్మ ఘంట జనవరి 12,సూర్యాపేట జిల్లా ప్రతినిధి



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ కుడకుడలో 2000-01 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను సోమవారం ఘనంగా నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న నాటి విద్యార్థులంతా ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి తమ గురువులను ఘనంగా సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తమ విద్యార్థులు నేడు వివిధ ఉన్నత స్థాయిలలో ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ఒకొక్కరుగా మాట్లాడి పాఠశాల జ్ఞాపకాలు,ప్రస్తుతం తమ స్థితిగతులను తెలిపి ఆనందంగా గడిపారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో నేడు తాము వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్కిరెడ్డి, సత్యనారాయణరావు, నర్సిరెడ్డి, కృష్ణయ్య శెట్టి, కృష్ణారెడ్డి, రాజేందర్ రెడ్డి,నాటి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి కోదాడ ఏడీఏ ప్రశాంతి

ధర్మఘంట జనవరి 12 మునగాల:



ప్రతీ మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లుగానే, ప్రతీ రైతుకి తప్పనిసరిగా రైతు గుర్తింపు కార్డు ఉండాలని,అందుకే రైతులు అందరూ ఈ రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రశాంతి అన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ విస్తరణ అధికారిచే చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి,రైతులు ఉద్దేశించి మాట్లాడుతూ ఇంతకు ముందు వ్యవసాయ శాఖ సిబ్బంది మాత్రమే ఆన్లైన్లో 3 ఓటీపీల ద్వారా దరఖాస్తు చేసేవారని, కానీ,ఇప్పుడు రైతుల శ్రేయస్సు కోసం మీ సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారని తెలిపారు. ఇంతకుముందు వ్యవసాయశాఖ సిబ్బంది దగ్గర ఓటిపిలు చెప్పి ఈ రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకున్నవారు మళ్ళీ దరఖాస్తు చెయ్యాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైతే రైతు గుర్తింపు కార్డు కొరకు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేదో వాళ్ళు మాత్రమే మీ దగ్గరలో ఉన్న ఏదైనా మీసేవ సెంటర్లో కానీ,లేదా భూములు ఉన్న మండలానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈవో) దగ్గరకు వెళ్ళి ఓటిపిలు చెప్పి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే పీఎం కిసాన్ రూ. 2000 నగదు పొందుతున్న రైతులు తప్పనిసరిగా ఈ రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే మాత్రమే వచ్చే విడత నగదు వస్తాయని,లేకపోతే రావని,అలాగే భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి ఎలాంటి పథకాలకైనా ఈ రైతు గుర్తింపు కార్డు కచ్చితంగా అవసరం ఉంటుందన్నారు. దరఖాస్తు కోసం వెళ్ళేటపుడు మీ పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు,ఆధార్ కి లింక్ ఉన్న ఫోన్ తీసుకుని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రాజు,వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. రమ్య, రైతులు కాసర్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

**అదనపు కలెక్టర్ కదిరవన్ పలని**
**వాట్సాప్ దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**
**మొత్తం 354 అర్జీల స్వీకరణ.**

హైదరాబాద్

జిల్లా లోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందచేసిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి (స్థానిక సంస్థలు), జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి తోకలిసి అదనపు కలెక్టర్ కదిరవన్ పలని (రెవెన్యూ) ప్రజల వద్ద నుంచి విన్నపాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసి, దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. దివ్యాంగులు అలాగే వయోవృద్ధుల వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని ఆయన సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన దరఖాస్తుల పురోగతిపై ఆయన సమీక్షించారు. పెండింగ్లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి,



త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సియం ప్రజా దర్బార్, వాట్సాప్ ప్రజావాణి, అలాగే జిల్లాలో నిర్వహించే ప్రజావాణిలో ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులలో ఏమైనా పెండింగ్ లో ఉంటే వెంటనే పరిష్కరించి, సంబంధిత వెబ్ సైట్లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు, ప్రజావాణిలో హౌసింగ్ శాఖ 282 కు (డబుల్ బెడ్ రూమ్ 09, ఇందిరమ్మ ఇండ్లు 273), రెవెన్యూ 52, ఇతర శాఖలు 20 కలిపి మొత్తం 354 ఆర్జీలు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆర్డీవో సికింద్రాబాద్ సాయిరాం, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, డిఇఓ రోహిణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు. కోటాజి, ఇలియాస్ అహ్మద్, జిల్లా పరిశ్రమల శాఖ జియం ప్రవణ్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ. ఓ విజయ లక్ష్మీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, కార్మికుల పక్షపాతి పీజేఆర్ కర్క పెంటయ్య



కూకట్పల్లి

పీజేఆర్ ఫౌండేషన్ కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కర్క నాగరాజ్ ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ కార్మిక శాఖ మంత్రి పి.జనార్ధనరెడ్డి 78వ జన్మదినోత్సవాన్ని మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కూకట్పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కర్క పెంటయ్య విచ్చేసి పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలకు పీజేఆర్ చేసిన సేవలను నెమరేసుకున్నారు. బడుగు బలహీన వర్గాల నేత గా, కార్మికుల పక్షపాతి గా స్వపక్షామైన విపక్షామైన నిరంతరం ప్రభుత్వాలతో పోరాటం చేసిన గొప్ప నేతగా చరిత్ర లో నిలిచారని పేర్కొన్నారు. 1994 లో ప్రతిపక్ష నాయకుడి గా కేవలం 26 మంది ఎమ్మెల్యేలతో అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేసి పేద ప్రజల సమస్యల పరిష్కారానికై తనవంతు కృషి చేసారని వారు తెలిపారు. 610 జి.ఒ, పోతిరెడ్డి పాడు, ఆల్మట్టి డామ్, పెద్ద మనుషుల ఒప్పందం, హైదరాబాద్ నగరానికి కృష్ణా, గోదావరి జలాలు, ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు పిజెఆర్ అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కర్క శివశంకర్, అసోసియేషన్ అధ్యక్షులు కర్క నిఖిల్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాచమళ్ళ శేఖర్ గౌడ్, బీసీ వికాస సమితి అధ్యక్షులు భాశెట్టి నర్సింగ్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్క నర్సింగరావు, గురజాల రాజు, ఐసీడి కంటైనర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ అవార్డులకు ఎంపికైన జిల్లా విద్యార్థులు

హైదరాబాద్

రెహన్ రాజా, 10వ తరగతి, దేవనా పౌండేషన్ బైండ్, పాఠశాల, బేగంపేట, నైతిక్ లోహియా, 10వ తరగతి, ఆల్‌సేంట్స్, ఉన్నత పాఠశాల, గన్‌పౌండ్రి హైదరాబాద్ జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక తోపాటు ఆదిల్ అబ్దుల్ మాలిక్, సి.ఎం.ఆర్ హైస్కూల్, బోయినపల్లిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైనారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యార్థులకు శాలువాలు, మెమెంటోలతో జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జితేందర్ రెడ్డి, డిఆర్ఓ ఈ .వెంకటాచారీ, డిఇఈ రోహిణి లు ఘనంగా సంత్కరించి అభినందించారు. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు 18 పాఠశాల నుండి ఒక్కరి చొప్పున 18 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు, వారిలో ఇద్దరు ఎంపికైనారని, అలాగే రాష్ట్రస్థాయి బాల వైజానిక ప్రదర్శని లో 14 పాఠశాలల నుండి ఒక్కరి చొప్పున 14 మంది విద్యార్థులు పాల్గొన్నారని, పోటీ పడగా వారిలో ఒక్కరు జాతీయ స్థాయిలో ఎంపికైనారని తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 7వ తేది నుండి 9వ తేది వరకు కామారెడ్డి జిల్లాలో నిర్వహించనైనదని పేర్కొన్నారు.




ఇన్‌స్పైర్ అవార్డ్స్ (మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్) అనేది భారతదేశంలోని 6 నుండి 10వ తరగతులు చదువుతున్న విద్యార్థుల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించే భారత ప్రభుత్వ చేపట్టిన వినూత్న కార్యక్రమమని, ఇది సైన్స్ ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యార్థులకు ప్రేరణనిచ్చి, వారి ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు ఎంతగానే ఉపయోగపడుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, జిల్లా సైన్స్ అదికారి సి.దర్మేందర్ రావు, పాఠశాల అదికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు ఖండిస్తూ శాంతియుత నిరసన




హైదరాబాద్

ఇటీవల మహిళా ఐఏఎస్ పై ఎన్.టి వి లో ప్రసారమైన వార్త ను తీవ్రంగా ఖండిస్తూ ఎన్ టివి యాజమాన్యం బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పి సంబంధిత రిపోర్టర్ ను తక్షణమే తొలగించాలని జిల్లా అధికారులు, ఉద్యోగులు అలాగే టీజీవో, టీఎన్జీవో సంఘల నాయకులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రెవిన్యూ శాఖ అధికారులు, అన్ని శాఖల అధికారులు ఉద్యోగులు సిబ్బంది ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీవీ పై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో రెవిన్యూ అధికారులు, టీజీవో, టీఎన్జీవో, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తాసిల్దార్ల సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ఇటువంటి నిరాధారణ ఆరోపణలు భవిష్యత్తులో ఇకపై జరగకుండా చూడాలని ముక్తకంఠంతో ఖండిస్తూ మెమోరాండాన్ని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని కి అందజేశారు. ఈ శాంతియుత నిరసనలో టీజీవో జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియన్ అధ్యక్షులు రామకృష్ణ, తాసిల్దార్ సంఘం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, కార్యదర్శులు ఆశన్న, విక్రమ్ కుమార్, జిల్లా అధికారులు సురేందర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్

**దేశంలోనే రోల్ మోడల్, గేమ్ చేంజర్**
**పనుల పూర్తి క్యాలెండర్ ఖరారు చేయండి**
**నిధులకు ఇబ్బంది లేదు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు పే చేస్తాం**
**జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్

ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో మన పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వం డ్రీం ప్రాజెక్టు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రగతిపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పూర్తిచేసే బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్ల దేనిని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. టెండర్లు పూర్తి అయినచోట మంత్రి లేదా స్థానిక ఎమ్మెల్యే తో భూమి పూజ చేయించాలని, భవనాల నిర్మాణం పూర్తికి క్యాలెండర్ ఫిక్స్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రగతిపై సమీక్ష జరపాలని నెలలో ఒకసారి కలెక్టర్లు తమ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రదేశానికి తప్పకుండా వెళ్లాలని అక్కడే సమీక్ష నిర్వహించాలని తెలిపారు. స్కూల్స్ నిర్మాణంలో నిధులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్స్ పేమెంట్ జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఇప్పటివరకు విడివిడిగా ఉన్నాయి వీటన్నిటిని ఒకే చోట చేర్చి ఒక గొప్ప సందేశాన్ని ప్రపంచానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం




ఇవ్వబోతున్న అని తెలిపారు. సమాజంలో వర్గాలుగా విడగొట్టబడినట్టు ఉన్న వారందరినీ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా ఒకచోటకు తమ ప్రభుత్వం తీసుకురాబోతుందని తెలిపారు. ఈ పాఠశాలలు దేశంలోనే ఒక రోల్ మోడల్ గా, గేమ్ చేంజెర్లుగా మారలు ఉన్నాయని తెలిపారు. అగ్రిమెంట్ పూర్తి చేసుకున్న 15 రోజుల్లో కాంట్రాక్టర్లు పని ప్రారంభించక పోతే కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి అత్యధిక శాతం స్కూల్స్ అందుబాటులోకి రావాలని ఆదేశించారు. స్థానికంగా భూమి ఇతర సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే లేదా సిసిఎల్ఏ, చీఫ్ సెక్రటరీ తో కలెక్టర్లు మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. బిల్డింగ్స్ నిర్మాణంలో ఎప్పటికప్పుడు క్వాలిటీ చెక్ కోసం థర్డ్ పార్టీ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని, నిర్మాణం జరిగే ప్రాంతానికే క్వాలిటీ చెక్ బృందం వెళ్లాలని ఆదేశించారు. పనుల ప్రగతిపై వారానికి ఒకసారి చీఫ్ సెక్రటరీ కలెక్టర్ల నుంచి నివేదిక తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి అట్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తాన్య, టీజీ డబ్ల్యూ డి సి ఎం.డి గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## కైట్ ఫెస్టివల్ మతసామరస్యానికి ప్రతీక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





కైట్ ఫెస్టివల్ మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డు సమీపంలోని ఐమాక్స్ సర్కిల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు వేసే ముగ్గులు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చక్కటి సందేశాన్ని ప్రజలకు అందించాయి, ముగ్గుల ద్వారా మహిళల ఆలోచనలతో పాటు విషయ పరిజ్ఞానం బయటికి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్డూరి లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.